RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers



హైదరాబాద్ 15 జూలై 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:40

## ఎయిర్ పోర్టు అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి

# కేంద్రమంత్రికి రేవంత్ వినతి



న్యూఢిల్లీ, జూలై 14 తెలంగాణ రాష్ట్రంలో నిర్మిం చనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమా నాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను సీఎం వివరించారు.కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాల యం రాజీవ్ గాంధీ భవన్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలతో వరంగల్ కీలక నగరంగా ఉందని సీఎం తెలిపారు.

మిగతా 2లో

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ



ఢిల్లీ: రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో పనుల ప్రారంభానికి కేంద్ర మంత్రిమండలి అనుమతి ఇప్పించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కి విజ్ఞప్తి చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలు రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తికావడమే కాకుండా నిర్మాణ వ్యయం తగ్గుతుందని వివరించారు. కేంద్ర మంత్రి గడ్కరీ తో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోరారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిట నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్ – విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని వివరించారు. హైదరాబాద్ నుంచి బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని తెలిపారు మన్ననూరు – శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని గుర్తుచేశారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల రహదారికి అనుమతులు మంజూరు చేయాలని నితిన్ గడ్కరీ ని కోరారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు.? ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సింగరేణిని కాపాడతాం



మంచిర్యాల, జూలై 15తెలంగాణకు గుండెచప్పుడు లాంటి సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి నిలువునా ముంచేశాయని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. కేసీఆర్ కుటుంబం, కాంగ్రెస్ పాలకులు పోటీపడి మరీ సింగరేణిని తమ సొంత ఖజానాలా వాడుకున్నారని మండిపడ్డారు. కార్మికుల చెమట వాసన తెలిసిన సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టి, ఇప్పుడు దాని భవిష్యత్తును పూర్తిగా అంధకారంలోకి నెట్టేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.సింగరేణి నుంచి బొగ్గు కొనుగోలు చేసి, విద్యుత్ వాడుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను తుంగలో తొక్కిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం సుమారు రూ. 30 వేల కోట్ల బకాయిలు పెట్టిపోతే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానికి మరో రూ. 24 వేల కోట్లు జోడించిందని మండిపడ్డారు. ఇలా మొత్తం రూ. 54 వేల కోట్ల కార్మికుల కష్టార్జితాన్ని అప్పులపాలు చేసి, సంస్థను ఆర్థిక సంక్షోభంలోకి తోశారని ఆరోపించారు. కేసీఆర్ తన హయాంలో సింగరేణి బోర్డును ఉత్సవ విగ్రహంగా మార్చి, టెండర్ల పేరుతో భారీ దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు.రాజకీయాలు చేయడానికి తాను ఇక్కడికి రాలేదని, సింగరేణిని కాపాడుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గత పాలకులు సంస్థ ఆదాయాన్ని ఫుట్‌బాల్ మ్యాచ్‌లు వంటి అనవసరమైన వాటికి మళ్లించారని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ హయాంలో సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించి కార్మికులకు అసలైన భరోసా కల్పించామన్నారు. సింగరేణి మనుగడ కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా కేంద్రం అండగా నిలబడుతుందని, కార్మికుల ప్రయోజనాలను కాపాడి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు.

# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయం.

**మంత్రి మల్లు భట్టి విక్రమార్క.**

**జిల్లాలో రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు.**

**ఎర్రవల్లి వద్ద రూ.155 కోట్ల నిధులతో ఉప కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన.**

నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిధులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్చాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశు





సంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్ల నిధులతో 220/132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, ఇతర ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 20న క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్లకు శ్రీకారం

**-మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

2



నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవిజన్మదినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఆయనకు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపిన ఏఐసీసీ ఇన్చార్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్..

ప్రజాబలం

15 జూలై 2026 బుధవారం

# యుద్ధంలో సమిధలవుతున్న సామాన్యులు

పశ్చిమాసియాలో నెలకొన్న శాంతియుత పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారిపోయాయి. ఇరాన్ ను లక్ష్యంగా చేసుకుని అమెరికా భీకర దాడులకు దిగింది. ప్రతిగా ఇరాన్ కూడా ఎదురు దాడులకు దిగింది. యుద్ధం మూలంగా కేవలం ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా నే కాకుండా సమీపంలోని లెబనాన్,గల్ఫ్ దేశాలకు తీవ్ర నష్టం కలిగించింది. అటు ఆయా దేశాల్లోని అమెరికా స్థావరాలకు తీవ్ర నష్టం కలిగించింది. యుద్ధం మూలంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు కొరత ఏర్పడి పలు దేశాలు లాక్ డౌన్ దిశగా అడుగులు వేస్తున్నాయి. యుద్ధం మూలంగా కేవలం ఆస్తి, ఆర్థిక నష్టమే కాదు పెద్ద ఎత్తున ప్రాణ నష్టం కూడా సంభవించింది. ముఖ్యంగా ఇరాన్‌లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ముక్కుపచ్చలారని చిన్నారులు ఎందరో ఉన్నారు. ఎన్నో వందల మంది గాయాలపాలయ్యారు. పరస్పర దాడుల్లో ఆ రెండు దేశాలకు ఏ మేర నష్టం వాటిల్లిందన్న విషయాన్ని పక్కనపెడితే?ఇరాన్ దాడుల్లో భారత్ కు చెందిన ఓ వాణిజ్య నౌక ధ్వంసం కాగా? అందులోని ఓ భారతీయుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన హర్మూజ్ జలసంధికి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది.రెండు దేశాల మధ్య యుద్ధం కారణంగా ఆ దేశాలకు చెందిన ఆస్తి, ప్రాణ నష్టాలు సర్వసాధారణమే అయినప్పటికీ? ఆ యుద్ధం కారణంగా ఇతర దేశాలకు.. అది కూడా అలీన ఉద్యమంతో ప్రపంచ శాంతికి బాటలు వేస్తున్న భారత్ లాంటి దేశాలకు నష్టం వాటిల్లుతుండటం గమనార్హం. అమెరికా, ఇరాన్ యుద్ధంలో భారత్ ఏ ఒక్క దేశానికి మద్దతు పలక లేదు. అదే సమయంలో ఇరు దేశాలు చర్చించుకుని ప్రపంచ శాంతికి పాటుపడాలని భారత్ ఆకాంక్షిస్తున్న సంగతి తెలిసిందే. ఇలాంటి నేపథ్యంలో ఇరాన్ దాడిలో భారత నౌక ధ్వంసం కావడం, అందులోని ఓ భారతీయుడు గల్లంతు కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధానికి శాశ్వత ముగింపు పలికేందుకు జరుగుతున్న శాంతి ప్రయత్నాలపై తాజాగా జరుగుతున్న పోరాటం కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నది. ఇక ఈ రెండు దేశాల మధ్య శాంత కల్లేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జరిపిన రెండు దాడుల కన్నా తీవ్రంగా ఆదివారం ఇరాన్‌లోని 140కు పైగా క్షిపణి, డ్రోన్ కేంద్రాలు, ఆయుధాగారాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర ప్రాంతాలపై లక్షిత దాడులు చేసినట్టు అమెరికా ప్రకటించింది. 'ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అది మూల్యం చెల్లిస్తున్నది' అని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఆన్‌లైన్‌లో పోస్ట్ పెట్టారు. తాము మాత్రమే హ్బార్మూజ్ జలసంధిని నియంత్రించగలమని, దాని ద్వారా పయనించే నౌకలపై చార్జీలు విధించగలమని ఇరాన్ స్పష్టం చేసింది. ఏకపక్ష ఒప్పందాల శకం ముగిసిందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ బాఘెర్ ఘాలిబాఫ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. కాగా, ఇరాన్ క్షిపణులను తాము సమర్థంగా అడ్డుకున్నట్టు ఖతార్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా క్షిపణి శకలాలు పడి ఒక పిల్లవాడు సహా ముగ్గురు పౌరులు గాయపడ్డట్టు తెలిపింది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను తాము కూడా అడ్డుకున్నట్టు కువైట్ మిలిటరీ ప్రకటించింది. ఆదివారం బహ్రెయిన్‌లో పౌరులకు మూడుసార్లు హెచ్చరిక సైరన్లు మోగాయి.సైప్రస్ జెండాతో భారత్ బయలుదేరిన జీఎఫ్ఎస్ గెలాక్సీ నౌకపై ఒమన్ తీరం సమీపంలో హర్మూజ్ జల సంధికి చేరుకున్న సమయంలో ఇరాన్ నుంచి దూసుకువచ్చిన బాంబు పడింది. దీంతో గెలాక్సీ నౌకలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. నౌకలో మంటలు చెలరేగిన సమయంలో అందులో ఉన్న 11 మంది భారతీయులు దానిని వదిలేసి చిన్నపాటి లైఫ్ బోటులో ప్రాణాలు కాపాడుకునే యత్నం చేశారు. ఈ క్రమంలో 10 మంది భారతీయులు చిన్నబోటులో సురక్షిత ప్రాంతానికి చేరుకోగా? మరో వ్యక్తి మాత్రం గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. కాగా, ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిదాకా ఇరాన్‌లో 8,531 మంది మరణించారని అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘం హెచ్ఆర్ఏఎన్ఏ పేర్కొంది. వీరిలో 5,607 మంది సామాన్య పౌరులు ఉన్నారని తెలపడం గమనార్హం. అంతేకాదు మృతుల్లో 1244 మంది పిల్లలు కూడా ఉన్నారని పేర్కొనడం గుండెతరుక్కుపోయే విషం. క్షేత్రస్థాయి నివేదికలు, స్థానికుల సమచారం, వైద్య, అత్యవసర వనరులు, అధికారిక ప్రకటనల ఆధారంగా తాము ఈ సమాచారాన్ని సేకరించినట్టు ఆ సంస్థ తెలిపింది. ఆ సమాచారం ఆధారంగా ఇరాన్‌లో 5500 మందికి పైగా చనిపోయారని పేర్కొంది. ఇదిలా ఉండగా అంతర్జాతీయ సంస్థ అయిన రెడ్‌క్రాస్ వాదన మరోతీరు ఉంది. అమెరికా -ఇజ్రాయెల్ దాడుల మూలంగా ఇరాన్‌లో ఇప్పటివరకు కనీసం 3,900 మంది మరణించగా, 60,000 మంది గాయపడ్డారని పేర్కొన్నది. ఇక, మార్చి 2 నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 1124 మంది చిన్నారులతో పాటు దాదాపు 3,368 మంది లెబనాన్ పౌరులు మరణించారని లెబనీస్ అధికారులు వెల్లడించారు. అలాగే, లెబనీస్ సాయుధ సంస్థ హిజ్బుల్లాకు చెందిన 400 మంది సైనికులు మరణించారని ఆ సంస్థ ప్రకటించింది. అలాగే ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాక్‌లో 702మంది మరణించారు.ఇరాన్ దాడికి ఖండిస్తూ ఆ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. దాడి జరిగిన సమయంలో ఒమన్ ప్రభుత్వం వేగంగా స్పందించి? ప్రమాదంలో పడిన భారతీయులను కాపాడిందని ఆ శాఖ తెలిపింది. భారతీయులను కాపాడిన ఒమన్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. గల్లంతైన వ్యక్తి కోసం ఒమన్ దేశ సహాయక సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టినట్టు తెలిపింది.

## ఎయిర్ పోర్టు అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి

# కేంద్రమంత్రికి రేవంత్ వినతి

మొదటి పేజీ తరువాయి

రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు.ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండ జిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు ఉండాలని భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు.ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయం నిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణ సంస్థలు (ఈయూ)నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు.× హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్లు నడిపే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్ మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకు సహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏవైనా సమాచారలోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీకి వస్తున్నామని, దానిపైనా రాజకీయంగా విమర్శలు చేయడం తగదని సీఎం హితవు పలికారు. విమానాశ్రయాలతోనే అనేక దేశాలు అభివృద్ధి చెందాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రాష్ట్రాలు పోటీపడుతున్నాయని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనంత త్వరగా తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణ చేసి ఇచ్చి చరిత్ర సృష్టించిందని ఆయన అభినందించారు. ఇంత త్వరగా స్పందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. భూ సేకరణ, ఇతర అంశాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణ మాదిరే స్పందించాలని కేంద్రం మంత్రి సూచించారు. వరంగల్ సంస్కృతికి అద్దం పట్టేలా విమానాశ్రయ డిజైన్ ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

2028 జూన్ నాటికి పూర్తిచేస్తాం

జూన్ 2, 2028 నాటికి మామునూరు ఎయిర్‌పోర్ట్ పూర్తి

వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని జూన్ 2, 2028 నాటికి పూర్తి చేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కోరారని, దానికి అనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. త్వరలోనే వరంగల్ ప్రజలకు ఒక అద్భుతమైన విమానాశ్రయం అందుబాటులోకి రానుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

: జూన్ 2, 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్ట్ పూర్తి: రేవంత్ రెడ్డితో భేటీ అనంతరం రామ్మోహన్ నాయుడు

తెలంగాణలో వైమానిక రంగాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగానే ఆదిలాబాద్ విమానాశ్రయ ఏర్పాటును కూడా కేంద్రం పరిశీలిస్తోందని చెప్పారు. ఆదిలాబాద్‌లో ప్రస్తుతం ఉన్న రక్షణశాఖ భూముల వ్యవహారం కొలిక్కి వచ్చిన వెంటనే, దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. వీలైనంత త్వరగా భూ సేకరణ పూర్తి చేసి ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ పనులను కూడా వేగవంతం చేస్తామని కేంద్రమంత్రి వివరించారు.

నితిన్ గడ్కరీతో రేవంత్ భేటీ

రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఫుల్ బిజీగా ఉన్నారు. కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఆయన రెండోసారి ఢిల్లీకి వెళ్లడం గమనార్హం. ఈ ఉదయం కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రేవంత్ కలిశారు. రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర (నార్త్) భాగం పనులకు వెంటనే కేబినెట్ ఆమోదం తెలపాలని, దక్షిణ భాగానికి పూర్తి అనుమతులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర జాతీయ రహదారులను డ్రై పోర్టులతో అనుసంధానించే కొత్త దారులకు అనుమతులు ఇవ్వాలని విన్నవించారు.కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కూడా రేవంత్ కలవనున్నారు. తెలంగాణలో మూడు ఎయిర్ పోర్టులకు సంబంధించి చర్చించనున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో కూడా ముఖ్యమంత్రి భేటీ కానున్నారు.

# ఈ నెల 20న క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్లకు శ్రీకారం

**దశలవారీగా లక్ష ఇండ్ల నిర్మాణం**

**పైలట్ ప్రాజెక్టుగా నియోజకవర్గానికి వెయ్యి ఇండ్ల వరకు నిర్మాణం**

**గ్రామీణ ప్రాంతాల్లో మొదలైన ఇందిరమ్మ ఇళ్ల విప్లవం... ఇప్పుడు పట్టణ పేదల జీవితాల్లోకి**

**-మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లతో పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం ఇప్పుడు అదే సంకల్పంతో క్యూర్ ప్రాధిలోని పేదల సొంతింటి స్వప్నాన్ని నిజం చేసేందుకు మరో చారిత్రాత్మక అడుగు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా క్యూర్ పరిధిలో దశల వారీగా లక్ష ఎల్.ఐ.జీ. ఇందిరమ్మ ఇండ్లను నిర్మించబోతున్నామని, ఇందుకు సంబంధించి ఇప్పటికే పరిపాలన అనుమతులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇండ్ల పై హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల పథకానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు శ్రీ పొన్నం ప్రభాకర్, శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి శ్రీ మహ్మద్ అజారుద్దీన్‌తో కలిసి పథకానికి సంబంధించిన విధివిధానాలను, దరఖాస్తుల ఆహ్వానం, అర్హతలు, టెండర్ల ప్రక్రియ, అమలు విధానం తదితర పూర్తి మార్గదర్శకాలను ప్రకటిస్తామని వివరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గానికి కనీసం 500 చొప్పున ఆయా స్థానిక పరిస్థితులనుబట్టి అవసరమైన చోట వెయ్యి వరకు నిర్మిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఎలాంటి ముందుచూపు లేకుండా, హైదరాబాద్ నగరానికి 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించడంవల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోతామనే ఆందోళనతో చాలామంది అక్కడ నివసించలేకపోయారని అన్నారు. తమ ప్రభుత్వం మాత్రం పేదల జీవన వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే, వారి ఉపాధి, పిల్లల విద్య, వైద్య సౌకర్యాలు, రవాణా వంటి అంశాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని అత్యంత ముఖ్యమైన ప్రాంతాల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లను నిర్మిస్తున్నామని, ఆ స్థలములో వారికి వాటా ఇస్తూ యాజమాన్య హక్కు కల్పిస్తూ వారి కుటుంబాలకు శాశ్వత ఆర్థిక భద్రతను కల్పిస్తున్నామన్నారు. క్యూర్ పరిధిలో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించడం జరిగిందని, ఈ స్థలాలను ఇప్పటికే హౌసింగ్ విభాగం పొజిషన్ లోకి తీసుకుందని, ఎక్కడ ఎన్ని ఇండ్లు, ఎన్ని అంతస్తులు నిర్మించాలి, ఒక్కో ఫ్లాట్ విస్తీర్ణం, బిల్డింగ్ డిజైన్ లను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి రెండు, మూడు రోజుల్లో తుది రూపును ఇస్తామని వెల్లడించారు.

## తెలంగాణ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి ,12వ వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

గోదావరిఖని : తాడిచర్ల బ్లాక్-2 ను సింగరేణికి కేటాయించినందుకు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కి నాయకుల కృతజ్ఞతలు తెలిపారు.సింగరేణి లో "భరోసా యాత్ర" పేరుతో మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా ఓసిపి-5 కి విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కి సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ వినతి పత్రం లో తెలంగాణలో ఉన్న బొగ్గు గను లను వేలం పాట లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని,12వ వేజ్ బోర్డు ఒప్పంద ప్రక్రియను ప్రారంభించేందుకు తక్షణమే వేతన కమిటీని ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్ లతో సంబంధం లేకుండా గతంలో వలే 12వ వేజ్ బోర్డు వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణికి తాడిచర్ల బ్లాక్-2 ను కేటాయించినందుకు కేంద్ర మంత్రి కి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. వినతి పత్రం అందజేసి , కేంద్ర మంత్రి కి డిమాండ్ లను వెల్లడించిన వారిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శిమడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు ఉన్నారు, ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి నాయకులు మాదన మహేష్, బోగ సతీష్ బాబు, ఎస్. వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్, మానాల శ్రీనివాస్, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు--ఆదిలాబాద్ రైలుమార్గంతో ఉత్తర తెలంగాణకు మహర్దశ

(సి.హెచ్.ప్రతాప్)

తెలంగాణలో సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత 136.5 కిలోమీటర్ల పటాన్‌చెరు--ఆదిలాబాద్ కొత్త రైలుమార్గం త్వరితగతిన ఆమోదం పొందాల్సిన అవసరం ఉంది. ఈ మార్గం అమల్లోకి వస్తే ఉత్తర తెలంగాణలోని అనేక పట్టణాలు, గ్రామాలకు మెరుగైన రైల్వే అనుసంధానం లభించడంతో పాటు పారిశ్రామిక, వ్యవసాయ, వాణిజ్య రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయి.

ఈ రైలుమార్గం నిర్మాణం ద్వారా నిజామాబాద్, నిర్మల్, ఆర్మూర్, ఆదిలాబాద్ ప్రాంతాలకు హైదరాబాద్‌తో మరింత వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం రోడ్డు మార్గాలపై ఉన్న ఒత్తిడి తగ్గడమే కాకుండా, ప్రయాణ సమయం, రవాణా వ్యయం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణికులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఉత్తర తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు దేశంలోని ఇతర ప్రాంతాల మార్కెట్లతో ప్రత్యక్ష అనుసంధానం ఏర్పడుతుంది. పసుపు, పత్తి, మిర్చి, ధాన్యం, పండ్ల వంటి వ్యవసాయ ఉత్పత్తులను వేగంగా మార్కెట్లకు తరలించేందుకు ఈ రైలుమార్గం దోహదపడుతుంది. అలాగే పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాల రవాణా, తయారీ ఉత్పత్తుల పంపిణీ సులభతరం కావడంతో కొత్త పెట్టుబడులు ఆకర్షించే అవకాశాలు పెరుగుతాయి.

అటవీ సంపద, పర్యాటక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలకు చేరుకోవడం కూడా మరింత సులభమవుతుంది. దీనివల్ల పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రైల్వే మార్గం వెంట ఉన్న ప్రాంతాల్లో గిడ్డంగులు, లాజిస్టిక్స్ పార్కులు, చిన్న పరిశ్రమలు అభివృద్ధి చెందేందుకు కూడా అవకాశం ఉంటుంది.

రైల్వే మౌలిక సదుపాయాలు కేవలం రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికే పరిమితం కావు. అవి ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి, పెట్టుబడుల ఆకర్షణకు, ఉపాధి కల్పనకు, సామాజిక అనుసంధానానికి పునాదిగా నిలుస్తాయి. అందువల్ల పటాన్‌చెరు--ఆదిలాబాద్ రైలుమార్గానికి త్వరితగతిన పరిపాలనా ఆమోదం లభించి, నిర్మాణ పనులు ప్రారంభమైతే ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుంది. దీర్ఘకాలిక దృష్టితో ఈ ప్రాజెక్టును అమలు చేయడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు గణనీయమైన తోడ్పాటును అందిస్తుంది.

## వృద్ధాప్యం లో భౌతికంగా వయసు అనేది ఒక సంఖ్య మాత్రమే - సాయి చౌదరి



వికారాబాద్ జులై 14: వయసుతో సంబంధం లేకుండా, శరీరంలో శక్తి తగ్గిపోయినా, ఆలోచనలతో, ఆనందంగా, ఉత్సాహంగా జీవించే తత్వాన్ని కలిగి ఉండడం. దీన్నే యవ్వన వృద్ధాప్యం, రెండో యవ్వనం, అరవై లో ఇరవై, మనసు వయసు అని పిలుస్తారని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. నేడు డే కేర్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో సాయి చౌదరి మాట్లాడుతూ వయసు పెరిగినా, శారీరకంగా చురుగ్గా ఉండడం, నిరంతరం వ్యాయామం,నడక, యోగా వంటివి చేస్తూ శరీరాన్ని దృఢంగా ఉంచుకోవడం. కండరాల బలం కోసం పప్పులు, సోయాబీన్ వంటి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం, ఎముకల దృఢత్వం కోసం ఆకుకూరలు, పాలు పెరుగు మరియు మలబద్ధకం నివారణకు పీచుపదార్థాలు తీసుకోవడం మరియు డీహైడ్రేషన్ రాకుండా మంచినీరు, ద్రవపదార్థాలు తీసుకోవడం చేయాలి అని సాయి చౌదరి అన్నారు. వృద్ధాప్యం లో 7 శీ 9 గంటలు నిద్రపోవడం వల్ల శరీరం రీచార్జ్ అయి అల్జీమర్స్ వంటి సమస్యల నుంచి రక్షణ లభిస్తుందని, జీవిత గమనం లోని గతం తాలూకూ చేదు అనుభవాల పరంపరను మెదడు నుంచి డిలీట్ చేసి, మంచి అనుభవాలను మననం చేసుకుంటూ వర్తమానం లో జీవిస్తూ ఉండాలి అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి పేర్కొన్నారు. భౌతికంగా వయసు అనేది ఒక సంఖ్య మాత్రమే, ఒక వ్యక్తి జీవనశైలి సక్రమంగా ఉంటే అతని బైలాజికల్ వయసును భౌతిక వయస్సు కంటే తక్కువగా ఉంచుకోవచ్చు అని నిత్యనూతన ఆలోచనలు ఉన్నంతవరకు మనిషికి వృద్ధాప్యం అనేది దరిచేరదు అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు.

## గాంధీ భవన్ వద్ద కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ దిష్టిబొమ్మ దహనం




హైద్రాబాద్ జులై 14: గాంధీభవన్లో తెలంగాణ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్ ఆధ్వర్యంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ , దిష్టిబొమ్మ ను దహనం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి గారిని మరియు కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేయడాని ఖండిస్తూ,మల్లయ్య యాదవ్ గారి. దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్ తేలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధైర్యం ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. దీ=ా నాయకులు నోటికి ఎంత వస్తే అంత మాట్లాడితే ఊరుకునేది లేదని వారిని హెచ్చరించారు. దీ=ానాయకుల్లారా.....ఖబర్దార్ అంటూ నినాదాలు చేశారు.

## మాజీ మంత్రి ఓటు గల్లంతు

గుంటూరు, జూలై 14 ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్న వేళ మాజీ మంత్రి ఓటే గల్లంతు కావడం చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణకుమారి పేరు గుంటూరు నగర ఓటరు జాబితాలో కనిపించకపోవడంతో ఆమె అధికారులను ఆశ్రయించారు. ఒక మాజీ మంత్రి ఓటే లేకపోతే సామాన్య ఓటర్ల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఓటరు జాబితాలో తన పేరు లేదని ఎన్నికల అధికారులు చెప్పడంతో అరుణకుమారి ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తన ఓటును పునరుద్ధరించాలని కోరారు.డాక్టర్ శనక్కాయల అరుణకుమారి 1999 నుంచి 2004 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రెండో మంత్రివర్గంలో ఆమెకు మంత్రి పదవి దక్కింది.ఇదిలా ఉండగా, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముగింపు దశకు చేరుకుంది. ఇంటింటి సర్వే, డిజిటలైజేషన్ ప్రక్రియకు జూలై 14 చివరి గడువుగా నిర్ణయించారు. మరణించినవారు, వేరే ప్రాంతాలకు వెళ్లినవారు, డూప్లికేట్ ఓట్లను తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రక్రియ లక్ష్యం.చివరి రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అధికారులు సవరణ పనుల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు ప్రజలు హెల్ప్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి సమయంలో మాజీ మంత్రి ఓటు గల్లంతు కావడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## పరిశుభ్రతే నులిపురుగులకు విరుగుడు

## ప్రొఫెసర్ లిల్లీ మేరి



హైదరాబాద్ జులై 14 : పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి రెడీ అయిన క్షణంలోనే కడుపునొప్పి అంటూ విల్లవిల్లాడుతారు. కొందరు తల్లిదండ్రులు బడి తప్పించుకోవడానికి అనుకుంటారు. మరికొందరు ఆకస్మాత్తుగా వచ్చే నొప్పిని చూసి గాబరా పడతారు. ఒక్కోసారి ఇది నులిపురుగుల వల్ల అయ్యి ఉండవచ్చు. పిల్లల ఆరోగ్యం పై అప్రమత్తంగా ఉండే తల్లిదండ్రులను ఇబ్బందికి గురి చేసే నులిపురుగులు తయారు కావడానికి ప్రధాన కారణం పరిశుభ్రత పాటించక పోవడమే అని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు లిల్లీ మేరి అన్నారు. నులిపురుగులతో ఒక్కోసారి ప్రాణాంతకమైన సమస్యలు కూడా వస్తాయి. రక్తహీనతకు 60 శాతం నులిపురుగులే కారణం అని ఆచార్యులు లిల్లీ మేరి తెలిపారు. జులై 20న నిర్వహించే మాప్ - అ ప్ డే సందర్భంగా మొదటి విడతలో మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు అందజేయాలని లిల్లీ మేరి అన్నారు.

సంవత్సరం పిల్లవాడి నుండి 19 సంవత్సరాల యువకుడి వరకు పొట్టలో పెరిగే పురుగులతో బాధపడుతూనే ఉంటారు. నులిపురుగులు, కొరడా పురుగులు, కొంకి పురుగులు, బద్దె పురుగులు, ఏలిక పాములు, దారపు పురుగులు లాంటివి మన పొట్టలు చేరి అనేక రోగాలకు కారణం అవుతుంటాయి అని ఆచార్యులు లిల్లీ మేరి తెలిపారు.

పిల్లల్లో తలెత్తే సమస్యలు:

రక్తహీనత, ఆకలి మందగించడం, శారీరకంగా బలహీనులు కావడం, కడుపునొప్పి, వికారముగా ఉండడం, వాంతులు, విరోచనాలు, మలములో రక్తం రావడం, మానసిక ఆందోళన వంటి అనేక రకాల సమస్యలకు నులి పురుగులు కారణమవుతాయని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు లిల్లీ మేరి అన్నారు.

ఎలా వ్యాపిస్తాయి అంటే:

నులిపురుగుల గుడ్లు మలము ద్వారా బయటకు వచ్చి మట్టిని కలుషితం చేస్తాయని, ఈ గుడ్లు మట్టిలో లార్వాలుగా ఉంది చెందుతాయని లిల్లీ మేరి అన్నారు. పిల్లలు మట్టిలో ఆడుకోవటం, చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహారం తీసుకోవడం వలన ఈ గుడ్లు లార్వాలు వారి లోపలికి చేరుకుంటాయని, పిల్లల్లో చేరిన లార్వాలు, గుడ్లు, క్రిములుగా వృద్ధి చెందుతాయని, ఎదిగిన నులిపురుగులు తిరిగి గుడ్లను ఉత్పత్తి చేసి పిల్లలకు అనారోగ్యం కలిగిస్తాయని లిల్లీ మేరి తెలిపారు.

ఒక్క మాత్రతో నులిపురుగులకు చెక్:

తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా పిల్లల్లో నులిపురుగులు పెరగకుండా జాగ్రత్త పడవచ్చని ముఖ్యంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రం తప్పనిసరిగా వేయాలని, ఈ మాత్రలను పంపిణీకై ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు గ్రామాలల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుందని, ఒకటి నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు ఏవైనా కారణాలతో పాఠశాలలకు వెళ్ళని పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలలోనూ, 6 నుండి 19 సంవత్సరాల పిల్లలకు వారు చదువుకునే పాఠశాల ల్లో ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఈమాత్రలు వేస్తారని ఆచార్యులు లిల్లీ మేరి పేర్కొన్నారు.

మాత్రలతో ప్రయోజనాలు ఎన్నో:

ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవడంతోపాటు వైద్యుల సూచనకు అనుగుణంగా ఆల్బెండజోల్ మాత్రలను క్రమం తప్పకుండా వెయ్యడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రధానంగా నులిపురుగుల భారి నుండి పిల్లలను కాపాడవచ్చు. రక్తహీనత,,పోషకాహార లోపము వంటి సమస్యలు అధిగమించవచ్చు. పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడుతుంది. శారీరక, మానసిక పెరుగుదలతో పాటు వికాసం పెంపొందుతుంది. పనిచేయగలిగే సామర్థ్యం పెరుగుతుంది. దీర్ఘకాలిక వ్యాధులు గల వారికి మాత్రలు వేయరాదని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు లిల్లీ మేరి పేర్కొన్నారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు:

జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చని, తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సహాయ ఆచార్యులు లిల్లీ మేరి తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయరాదు. భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన తరువాత సబ్బుతో కాళ్లు, చేతులు కడుక్కోవాలి.బయటకు వెళ్లేటప్పుడు చెప్పులు ధరించేలా చూడాలి. పెరిగిన గోళ్ళను ఎప్పటికప్పుడు తొలగించాలి. చేతి వేళ్లలో మట్టి లేకుండా ఉంచుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగాలి. వేడి ఆహారం తీసుకోవడంతో పాటు ఆహారంపై ఎప్పుడు కప్పి ఉంచాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు లిల్లీ మేరి పేర్కొన్నారు.

ప్రధాన ఉపాధ్యాయులకు సూచనలు:

నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులు అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తగు సలహాలు, సూచనలు అందిస్తారని మాత్రను వేయడానికి వచ్చే ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. విద్యార్థులు మాత్రను నేరుగా మింగకుండా చప్పరించిన తర్వాత మిగిలిన మాత్రను మింగేలా చూడాలని లిల్లీ మేరీ అన్నారు. 6 నుంచి 18 సంవత్సరాల లోపు వారికి పూర్తి మాత్రను ఆరేళ్లలోపు వారికి సగం మాత్రను వేయాలని, సమీపంలోని ఆరోగ్య కేంద్రం ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని, కడుపులో నులిపురుగులు ఎక్కువగా ఉండే విద్యార్థులకు వాంతులు, విరోచనాలు, తలనొప్పి, కడుపునొప్పి వంటి ప్రతికూల పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని, అయితే వీటి వల్ల ఎలాంటి నష్టముండదని, వారిని కేవలం నీడలో కూర్చోబెడితే సరిపోతుంది అని, మాత్ర గొంతులో ఇరుక్కుపోయిన సందర్భంలో వారిని తొడలపై కూర్చోబెట్టుకొని వీపుపై మాత్ర బయటకు వచ్చేవరకు తట్టాలని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు లిల్లీ మేరి పేర్కొన్నారు.

## అంబర్‌నగర్ బస్తీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించండి

## పద్మా రావు నగర్ లోని వాటర్ డిపార్ట్‌మెంట్ వద్ద ధర్నా



సికింద్రాబాద్ జులై 14; నియోజకవర్గం లోని బౌద్ధనగర్ దివిజన్ అంబర్‌నగర్ బస్తీలో నెలకొన్న తాగునీటి సమస్యపై బస్తి ట్రెజరర్ వరలక్ష్మి నేతృత్వం లో బస్తి వాసులు పద్మా రావు నగర్ లోని వాటర్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.అనంతరరాజు సలీం , మరియు శ్రీకాంత్ లను కలిసి మా సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా వారు మా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, అంబర్‌నగర్‌కు తాగునీటి సరఫరాను మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వరలక్ష్మి తెలిపారు

ఈ కార్యక్రమంలో ట్రెజరర్ వరలక్ష్మి, జాయింట్ సెక్రటరీ రోహిత్, ౧=ా వార్డ్ మెంబర్ నిర్మల ముదిరాజ్, ప్రమోద్, నాని, కవిత, మానస తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్ రావుపేటలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ

రామడుగు మండలం గోపాలరావుపేట్ గ్రామంలో మంగళవారం తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు సీపెల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం జెండా పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ హాజరై టిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ కవితక్క నాయకత్వంలో ప్రజలకు ఉచిత విద్య ఉచిత వైద్యం రైతే రాజు నియామకాలు సామాజిక తెలంగాణనే లక్ష్యంగా పాంచ జన్య పథకాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజల కోసం నిరంతరం బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేసే ఏకైక నాయకురాలు ఎవరైనా ఉన్నారంటే అది కవితక్క అని అన్నారు. బీసీ నినాదాన్ని ఎత్తుకున్న నాయకురాలు కవితక్క అని వారు అన్నారు. రేపు కవితక్క పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారం లోకి వస్తే సబ్బండ వర్గాలకు సమన్యాయం జరుగుతుందని వారు అన్నారు.

# వర్షాకాల వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి

## ఆరోగ్య కార్యక్రమాల అమలు వేగవంతం చేయాలి: డీఎంహెచ్‌వో డా. కె. ఆనంద్

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, జూలై 14 (ప్రజాబలం):** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణతో పాటు జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.





డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఫీవర్ సర్వేలు నిర్వహించి అనుమానిత కేసులను వెంటనే గుర్తించి చికిత్స అందించడంతో పాటు దోమల నివారణ చర్యలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమంలో టిబి నోటిఫికేషన్, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ), రోగుల గుర్తింపు, ఫాలోఅప్‌ను మెరుగుపరచాలని సూచించారు. మాతా--శిశు ఆరోగ్య కార్యక్రమంలో గర్భిణుల నమోదు పెంచడంతో పాటు ఎంసీహెచ్ కిట్ పోర్టల్‌లో వివరాలను సకాలంలో నమోదు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధుల పర్యవేక్షణను బలోపేతం చేయడంతో పాటు ఏఎఫ్‌పీ, మీజిల్స్--రుబెల్లా కేసులను తప్పనిసరిగా నోటిఫై చేయాలని తెలిపారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై తల్లిదండ్రుల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వైద్యాధికారులు పేరెంట్స్--టీచర్స్ సమావేశాలకు హాజరుకావాలని సూచించారు. అర్హులైన పిల్లల వివరాలను యూ--విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, అసంక్రమ వ్యాధుల నియంత్రణలో రక్తపోటు, మధుమేహం కేసుల గుర్తింపు, పోర్టల్ నమోదులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసి రాష్ట్రంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలపాలని డా. కె. ఆనంద్ పిలుపునిచ్చారు.

సమావేశంలో ఉప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు డా. గీత, డా. లావణ్య రెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డా. నాగరాజ్, డా. గీత, డా. చంద్రకళ, డా. పవన్ కుమార్ రెడ్డి, డా. కౌశిక్, జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# హైదర్ నగర్ గవర్నమెంట్ స్కూల్లో ఎత్తుగా ఉండి నిర్మాణంలో ఉన్న బేస్ మెంట్ పై ఎక్కలేని ఓటర్లకోసం ఇనుప మెట్లను అంద చేసిన: ఎండి కలీం



**శేర్లింగంపల్లి ( ప్రజాబలం పెట్టినది నరేష్) జూలై 14** 2002 ఎన్నికల్లో ఓటు వేసిన ఓటర్లం దరూ 2026 ప్రకారంగా అప్పటి నెంబర్లు మార్పులు చేర్పు లను చేస్తూ ఎన్నికల అధికారులు సూచించిన సూచనలతో రాష్ట్ర మంతటా జరుగుతున్న సార్ కార్యక్రమంలో భాగంగా హైదర్ నగర్ లో బిఎల్ఓ లు స్కూల్ బిల్డింగ్ లో కూర్చోవడం జరిగింది. ఇక్కడికి వస్తున్న పాత ఓటర్లలతో పాటు కొత్తవారు కూడా సార్ ఫారా లను నింపించే పద్ధతులు కొంత మంది బిఎల్ ఓ లకు అవగాహన లేకపోవడం ఓట ర్లకు జరుగుతున్న అన్యాయాలను సరిదిద్దే వారు లేకపోవ డంతో వారికి ఓటు రాకపో వడం ఇబ్బం దిగా మారకూడదన్న విషయమై తన వద్ద ఉన్న కొంత మంది యువకు లను సైతం బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఎండి కలీం భాయ్ ఏర్పాటు చేయడం జరిగింది.కాగా సోమవారం రోజు ఆల్విన్ కాలనీ డిప్యూటీ కమిష నర్ చాముండే శ్వరి మేడంగారితో ఈ విషయాన్ని ప్రస్తా వించగా,తన సిబ్బంది సైతం పంపుతు న్నానని తెలిపిందని తెలియజేశారు.ఏదే మైనాప్పటికీ ఓటర్ల హైదర్ నగర్ ప్రభు త్వ పాఠశాల నిర్మాణ దశలో ఉండడం తో బిఎల్ఓల దగ్గరరావాలంటే స్కూల్ బేస్మెంట్ ఎత్తుగా ఉండడంతో ఎక్కలేక దిగలేక ఇబ్బందులు పడుతున్న వారి కోసం రూ. 12 వేలకు పైచిలు కు తన సొంత ఖర్చులతో ఇనుప మెట్లు నిర్మించి ఇచ్చానని తెలి పారు. దీంతో వచ్చే పోయేవారు చక్కగా దిగడం ఎక్కడం చేస్తుండ దం ఆయన ఎంతో సంతోషిం చడం తోపాటు వచ్చిన అధికారులుసై తం ఎండి కలీమ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రామ్ నరేష్ నగ ర్ కాలనీ అధ్యక్షులు నక్క శ్రీనివాస్,న్యా యవాదులు (బీఆర్ఎస్)నా యకులు సిందం శ్రీకాంత్, ఎంఏ ఖదీర్, వెంకటేష్ యాదవ్,జమీ రుద్దీన్,ఆశు,బాబు జాకీర్ దస్తగీర్ తదితరులు పాల్గొన్నారు.

# జొన్నగిరి గోల్డ్ మైన్స్ విస్తరణ..

కర్నూలు, జూలై 14 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక మరియు గనుల రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకుందికర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ 'జొన్నగిరి గోల్డ్ మైన్స్'బంగారు గనులు) ప్రాజెక్టు విస్తరణకు ప్రభుత్వం భారీగా భూములను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు కోసం అదనంగా మరో 998 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. ఈ భూసేకరణలో భాగంగా ఏపీ దేవాదాయ శాఖకు చెందిన భూములను కూడా వినియోగించుకోనున్నారు.దేవాదాయ శాఖ పరిధిలోని సుమారు 40 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన లీజు నిబంధనలు మరియు ప్రక్రియను పూర్తి చేస్తూ ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు విస్తరణ ద్వారా రాయల్టీ మరియు పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరనుంది.అంతేకాకుండా, ఈ మైనింగ్ పనులు పూర్తిస్థాయిలో ఊపందుకుంటే కర్నూలు జిల్లా పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది స్థానిక యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వెనుకబడిన ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. బంగారు గనుల తవ్వకం మరియు ప్రాజెక్ట్ పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ప్రాజెక్టు విస్తరణకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జొన్నగిరి గోల్డ్ మైన్స్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.

# ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం




హైద్రాబాద్ జులై 14 : హైదరాబాద్‌లోని ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నేడు మానవతా దృక్పథంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అవసరమైన నిరుపేదలు, వృద్ధులు, కార్మికులు మరియు పేద కుటుంబాలకు ప్రేమతో, గౌరవంతో భోజనం అందజేశారు. సమాజంలో ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం గొప్ప సేవ అని భావిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, "మానవ సేవే మాధవ సేవ" అనే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని సంస్థ ఎక్సిక్యూటీ మెంబెర్ జి.మాధవి తెలిపారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, వాలంటీర్లు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించారు.

ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సమాజ సేవలో భాగంగా ఆరోగ్య, విద్య, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ ప్రజలకు అండగా నిలుస్తోంది.

# రైతుల కోసం రక్తం ఇవ్వటమే కాదు రక్తం దారపోయడానికైనా సిద్ధం

## వేములవాడ బిఆర్ఎస్ ఇంచార్జ్ చెల్మెడ లక్ష్మీనరసింహారావు



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై -14** కాలేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కన్నెపల్లి పంపండి రైతులకు నీరు అందించాలని టిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేయగా సీఎం రేవంత్ రెడ్డి రైతన్నకు సాగునీరుకు బదులు టిఆర్ఎస్ పార్టీ నాయకుల రక్తాన్ని పొలాల్లో పారించాలని కోరినారు. దీనికి బదులు ఆ యావత్ తెలంగాణ టిఆర్ఎస్ నాయకులు రైతుల కోసం మా రక్తాన్ని ఇస్తామని వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ చెల్మెడ లక్ష్మి నరసింహారావు వారి నివాసంలో కార్యకర్తలతో పాటు రక్తాన్ని పంపిస్తున్నామని రైతన్నకు సాగునూరు ఇవ్వ అన్నం పెట్టే రైతన్నను అవహేళన చేస్తున్న నీకు బుద్ధి చెప్పే రోజులు వస్తాయని రైతుల కోసం రక్తం ఇవ్వటమే కాదు దారపోయడానికైనా సిద్ధమని పంట పండించడానికి రైతు చెమట ఓర్చి రక్త మాంసాన్ని కరిగిస్తాడన్న విషయం కూడా తెలియదా రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా చేసుకున్న నీకేం తెలుసని ఇప్పటికైనా కన్నెపల్లి పంప్ హౌస్ ఆన్ చేసి సకాలంలో రైతులకు నీరు అందించాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రామతీర్థం రాజు, నిమ్మ శెట్టి విజయ్, సిరిగిరి రామచంద్రం, క్రాంతి కుమార్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, మారం కుమార్, ప్రేమ్ చారి తదితరులు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పుల్కల్ మండలం ఉపసర్పంచలఫోరం నూతన అధ్యక్షులుగా ఎర్రశేఖర్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 14 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా,:** పుల్కల్ మండలంలో ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీలో, మండలంలోని 19 మంది ఉపసర్పంచ్ లు హాజరైనారు, వీరి ఆధ్వర్యంలో, అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది, అధ్యక్షులుగా సింగూరు కు చెందిన ఎర్రశేఖర్, ఉపాధ్యక్షులుగా గోరిల్ల రమేష్ మిన్పూర్, సహాయ కార్యదర్శిగా సింగూరి శశికళ,పెద్దారెడ్డి పేట, సహాయ కార్యదర్శిగా కాశగారి ప్రవీణ్ కుమార్, పుల్కల్, సలహాదారుగ నేనావత్ చాప్లా నాయక్, లక్ష్మీసాగర్, గార్లను తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, సమక్షంలో నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది, తెలంగాణ రాష్ట్రంలో 1279, మంది ఉపసర్పంచులము అందరివి ఒకటే కుటుంబం, ఒకటే యూనిటీ, మా ఆత్మ గౌరవం కోసం, శ్రమించి పాటుపడతామని నూతన ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు ఎర్రశేఖర్ అన్నారు, ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్ లు ఈ కార్యక్రమానికి పాల్గొన్నారు..

# మార్చిలోనే పోలవరం ప్రారంభం

ఏలూరు, జూలై 14 పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమాచారం వెల్లడించారు. ప్రస్తుతం 89 శాతం మేర పనులు జరిగాయని, గోదావరి పుష్కరాలు కంటే ముందుగానే నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా ప్రాజెక్టు పూర్తవుతుందని, ఆ తర్వాత జాతికి అంకితం చేస్తామని సీఎం పేర్కొన్నారు. గోదావరి జిల్లాల పర్యటన సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజి వద్ద జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ పునరుద్ధరణ, పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమైన సమాచారాన్ని సీఎం పంచుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలవరం పనులు 89 శాతం పూర్తయ్యాయని సీఎం చంద్రబాబు వివరించారు. రెండేళ్లలోనే పనులు పరుగులు పెట్టించామని వ్యాఖ్యానించారు. 2014-19 మధ్య పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే చేసి చేతులెత్తేసిందని విమర్శించారు. 2019లో టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తి చేసేవారమని సీఎం వ్యాఖ్యానించారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేసి వచ్చే మార్చిలో ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం హామీ ఇచ్చారుఇక ధవళేశ్వరం పర్యటన తర్వాత సీఎం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ముందుగా హెలికాప్టర్ నుంచి గోదావరి ప్రవాహం, ఎగువ దిగువ కాఫర్ డ్యాం పనులను చూశారు. అనంతరం ప్రాజెక్టులోని ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం గ్యాప్ 1, గ్యాప్ 2 నిర్మాణాలను విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి చేసేలా సిబ్బంది పనిచేయాలని పిలుపునిచ్చారు. కాగా, కూటమి ప్రధాన ఎన్నికల హామీ అయిన పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాలు కంటే ముందుగానే పూర్తి చేస్తామనే పట్టుదల ప్రభుత్వంలో కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. గత రెండేళ్లలో సుమారు 24 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులను చేపడుతున్న ప్రభుత్వం పోలవరం పూర్తికి అధిక ప్రాధాన్యమిస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం స్పిల్ వేతోపాటు ఈసీఎఫ్ఆర్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు పూర్తయ్యాయని చెబుతున్నారు. ఇంకా జల విద్యుత్ కేంద్రం నిర్మాణాలు మాత్రమే పెండింగులో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ప్రస్తుతం పూర్తయిన పనులతో కాలువలకు నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సిద్ధం చేశాకే ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోందని చెబుతున్నారు.

దీంతో వచ్చే ఖరీఫ్ నాటికి పోలవరం అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.

# వ్యూహం మార్చుకుంటున్న వైసీపీ?

## ఐ ప్యాక్ స్థానంలో కపిల్ సాహు

విజయవాడ, జూలై 14 2029 అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్న విపక్ష వైసీపీ 'సరికొత్త వ్యూహం'తో ముందుకు వస్తుందా? అన్న చర్చ జరుగుతోంది. కూటమిలోని మూడు పార్టీలు మళ్లీ కలిసికట్టుగా పోటీ అంటుండటంతో తమ గెలుపునకు సరైన వ్యూహం అవసరమని వైసీపీ గుర్తించిందని చెబుతున్నారు. దీంతో కొత్త రాజకీయ ఎత్తుగడతో ప్రజల ముందుకు రావాలనే ఆలోచనకు ఆ పార్టీ అధిష్టానం వచ్చిందని చెబుతున్నారు. ప్రధానంగా పార్టీకి ఇప్పటివరకు రాజకీయ వ్యూహాలు అందిస్తున్న 'ఐ-ప్యాక్'ను వదిలించుకోవాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐ ప్యాక్ స్థానంలో తమిళనాడులోని టీవీకే పార్టీకి వ్యూహకర్తగా పనిచేసిన కపిల్ సాహును వ్యూహకర్తగా నియమించుకోవాలని వైసీపీ భావిస్తోందని చెబుతున్నారు. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వైసీపీ సన్నాహాలు మొదలుపెట్టినట్లేనని అంటున్నారు రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి ఎదుర్కొన్న వైసీపీ మూడేళ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలని టార్గెట్ పెట్టుకుంది. ఇందుకోసం అనేక వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇందులో ప్రధానమైనది పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాదయాత్ర ఒకటి అయితే, రెండోది పార్టీకి సరైన ఎన్నికల వ్యూహాలు అందించే బృందంగా భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో ప్రముఖ ఎన్నికల వ్యూహాకర్త ప్రశాంత్ కిషోర్ సలహాలు, సూచనలతో రికార్డు విజయాన్ని సొంతం చేసుకున్న వైసీపీ.. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ బృందంలోని రిషిరాజ్ సింగ్ వ్యూహాలతో బోల్తా కొట్టింది. అయితే ఈ సారి తమిళనాడులో టీవీకే పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన కపిల్ సాహు వైపు చూస్తోందని కొద్దిరోజులుగా విస్తృత ప్రచారం జరుగుతోంది. ప్రశాంత్ కిషోర్ బృందానికే చెందిన కపిల్ సాహు ప్రస్తుతం సొంతంగా పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా డిజిటల్ ప్రచారంలో కపిల్ సాహుకు మంచి గుర్తింపు ఉందని చెబుతున్నారు. తమిళనాడులో టీవీకే పార్టీకి రాజకీయ వ్యూహాలు అందించిన కపిల్ సాహు సైలెంట్ గా టార్గెట్ ను కొట్టడమే హాట్ టాపిక్ అవుతోంది. ఎన్నికలకు ముందు ఎటువంటి అంచనాలు లేని టీవీకేని ఏకంగా ప్రభుత్వంలోకి తీసుకురావడానికి కపిల్ సాహు వ్యూహాలు బాగా పనికొచ్చాయని చెబుతున్నారు. రెండు బలమైన ప్రాంతీయ పార్టీలను మట్టి కరిపించి టీవీకేను ఓటర్లకు చేరువ చేయడంలో కపిల్ సాహు సక్సెస్ అయ్యారని అంటున్నారు. ఇదే అంశం వైసీపీని ఆకర్షిస్తోందని అంటున్నారు. కూటమి పార్టీలు కలిసి వుంటే ఓట్లు చీలడం కష్టమనే అభిప్రాయంతో ఉన్న వైసీపీ.. కూటమికి విరుగుడుగా వ్యూహాలు రచించే సరైన స్ట్రాటజిస్టు కోసం అన్వేషిస్తున్న క్రమంలో కపిల్ సాహు పేరు తెరపైకి వచ్చిందని అంటున్నారు. దీంతో ఆయనతో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. కపిల్ సాహుతో ఒప్పందం కుదిరితే రిషిరాజ్ సింగ్ కు చెందిన ఐ-ప్యాక్ స్థానంలో కపిల్ సాహు సెల్ఫ్-ఎంప్లాయిడ్ బృందం తెరపైకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. కాగా, వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తలపైనే ఆధారపడాలా? అన్న ప్రశ్న పార్టీలో విస్తృతంగా వినిపిస్తోంది. క్షేత్రస్థాయి లో పార్టీకి మరమ్మతులు చేయకుండా ఏం చేసినా ఉపయోగం లేదనే వాదన బలంగానే వ్యక్తమవుతోందని చెబుతున్నారు.

# శంషాబాద్ కు మరో గుర్తింపు

హైదరాబాద్, జూలై 14, హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు (శంషాబాద్ విమానాశ్రయం) మరో అంతర్జాతీయ గుర్తింపును సొంతం చేసుకుంది. ఫ్యామిలీలతో ప్రయాణించే వారికి అత్యంత అనుకూలమైన విమానాశ్రయాల జాబితాలో ప్రపంచవ్యాప్తంగా నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ ట్రావెల్ సంస్థ ఙబిబితీజీఇ-బితినీనిుతిఇ-ఎవబిబ.ఇ-నీఎ నిర్వహించిన 'హ్యాపియెస్ట్ ఎయిర్‌పోర్ట్స్ ర్యాంకింగ్స్'లో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఈ ఘనతను సాధించింది. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న భారతదేశంలోని 2 విమానాశ్రయాల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఒకటిగా నిలవడం విశేషం. ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన సర్వేలో ప్రపంచవ్యాప్తంగా 140కుపైగా విమానాశ్రయాలను ట్రావెల్ సంస్థ పరిశీలించింది. ప్రధానంగా కుటుంబ సభ్యులతో ప్రయాణించే వారికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను ప్రకటించారు. పిల్లల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, బేబీ చేంజింగ్ సదుపాయాలు, ఫ్యామిలీ సెక్యూరిటీ లేన్లు, స్ట్రోలర్ సేవలు, విశ్రాంతి ప్రాంతాలు, ఉచిత వై ఫై, ప్రయాణికుల భద్రత, విమానాశ్రయ విస్తీర్ణం, గూగుల్ సమీక్షలు, ప్రత్యేక అవసరాలున్న ప్రయాణికులకు అందిస్తున్న సేవలు వంటి మొత్తం 9 ప్రమాణాల ఆధారంగా ప్రతీ ఎయిర్‌పోర్టును అంచనా వేశారు. ఈ పరిశీలనలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు 20 పాయింట్లకు గాను 18.5 పాయింట్లు సాధించి ప్రపంచంలోనే నాలుగో అత్యుత్తమ ఫ్యామిలీ ఫ్రెండ్లీ ఎయిర్‌పోర్ట్‌గా గుర్తింపు పొందింది. ప్రయాణికుల సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు, అందరికీ అందుబాటులో ఉండే సేవలు ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు సాధించిన ఘనతపై జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈవో కదీర్ కదిరవన్ స్పందించారు. ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, సమగ్ర సేవలు అందించాలనే తమ లక్ష్యానికి ఈ గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రయాణ అనుభవాన్ని నిత్యం మెరుగుపరుస్తూ ప్రపంచ స్థాయి ప్రమాణాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదంలో

# ఎస్‌డీఆర్‌ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం

### మార్నింగ్ వాక్‌కు వెళ్తుండగా ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనంకర్నూలు



జాతీయ రహదారి 44 పై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ హెడ్ కానిస్టేబుల్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం... 2వ బెటాలియన్ ఏపీఎస్‌పీకి చెందిన ఎస్‌డీఆర్‌ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ రెడ్డి (43) ఈరోజు తెల్లవారుజామున సుమారు 5:20 గంటల ప్రాంతంలో బెటాలియన్ గేటు వద్ద తన స్కూటీని పార్క్ చేశారు. అనంతరం ఆయన జాతీయ రహదారి 44 పై మార్నింగ్ వాక్ (నడక) కోసం బయలుదేరారు. ఆయన బళ్ళారి చౌరస్తా సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా, అదే సమయంలో వేగంగా వచ్చిన ఒక గుర్తుతెలియని వాహనం ఆయనను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు వరప్రసాద్ రెడ్డి రోడ్డు పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు కింద పడిపోయారు. తీవ్ర గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుడు చిన్నరెడ్డి కుమారుడిగా పోలీసులు గుర్తించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు:ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌లను సేకరిస్తున్నారు.

# ఏపీలో మండుతున్న ఎండలు

విజయవాడ, జూలై 14 ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ఎండాకాలాన్ని గుర్తు చేస్తోంది. వాస్తవానికి జులై నెలలో వర్షాలు పడాల్సిందిపోయి.. వేడిగాలులు, ఎండల తీవ్రత కనిపిస్తోంది. గత రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వేడగాలుల తీవ్రత పెరిగింది. ముఖ్యంగా రాయలసీమలోని ప్రాంతాల్లో వేసవి మాదిరిగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం కోస్తా జిల్లాలు, రాయలసీమ ప్రాంతాల్లో భానుడు ప్రతాపం చూపించాడు. పగటిపూట ఉష్ణోగ్రతలు సాధరణం కన్నా నాలుగు నుంచి ఏడు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. బాపట్లలో ఏకంగా 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు జిల్లా జంగమేశ్వరపురం, తిరుపతిలో 41 డిగ్రీలు.. ఒంగోలులు 40.5 డిగ్రీలు, నంద్యాలలో 40.2, నెల్లూరులో 40.1 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో వారం రోజులు వర్షాలు పడవని.. ఎల్‌నినో కారణంగా నైరుతి రుతుపవనాలు బలహీనపడ్డాయని చెబుతోంది వాతావరణశాఖ. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణ, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వేడిగాలులు వీచాయి. కోస్తాలోని మిగిలిన జిల్లాలు, రాయలసీమ జిల్లా?లో వేడి వాతావరణం కొనసాగింది. ఈ నెల మొదటి వారం అక్కడక్కడా వర్షాలు పడినా.. ఆ తర్వాత మళ్లీ వాతావరణం మారిపోయింది. మళ్లీ ఎండలు, వేడిగాలుల ప్రభావం పెరిగింది. ఈ వేడిగాలులు మరికొన్ని రోజులు కొనసాగుతాయని అంచనా వేస్తున్నారు. ఈనెల మూడో వారంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి అవకాశం ఉందంటున్నారు. ఒకవేళ ఈ అల్పపీడనం ఏర్పడినా ఉత్తరాంధ్ర జిల్లాలలో మాత్రమే వర్షాలు పడతాయంటున్నారు. మిగిలిన జిల్లాల్లో వర్షాభావం కొనసాగుతుందని.. ఈ నెల 22వ తేదీ తర్వాత రుతుపవనాలు పుంజుకుంటే వానలు పడే అవకాశం ఉందంటున్నారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఏకంగా 25 శాతం లోటు వర్షపాతం ఉందని చెబుతున్నారు. అలాగే రాష్ట్రంలోని పలు జిల్లాలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని.. ఇది ఖరీఫ్ పంటలపై ప్రభావం చూపుతుందంటున్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్ని గమనిస్తే.. ఈ నెల 22వ తేదీ వరకు రాష్ట్రంలోని ఎక్కువ ప్రాంతాల్లో ఎండ తీవ్రత, వర్షాభావం కొనసాగుతాయని భావిస్తున్నారు. మొత్తం మీద రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోంది.. వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

### చేపలపై తీవ్ర ప్రభావం

ఎల్ నినో ప్రభావంతో దాదాపు వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.. చాలా ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి.. వర్షాలు ఆశించినంతంగా కురవకపోవడం వల్ల పంటల దిగుబడి తగ్గడంతోపాటు.. ఆహారం కొరత ఏర్పడే అవకాశం ఉంది.. దీంతోపాటు ఎల్ నీనో అనేక విషయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఎల్ నీనో పరిస్థితుల వల్ల చేపల లభ్యత కూడా తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా సముద్రంలో లభించే సార్డిన్‌ల లభ్యత తగ్గుతుందన్న వార్తలు ఆందోళనలను రేకెత్తించాయి. సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఈ హెచ్చరికను జారీ చేసింది. సముద్రంలో వడగాలులను సృష్టించే ఎల్ నినో.. బలపడటంతో చేపల లభ్యత తగ్గుతుందని అది హెచ్చరించింది. ఎల్ నినో వల్ల అత్యధికంగా ప్రభావితమయ్యే చేపలలో సార్డిన్ (కవళ్ళు లేదా కవ్వలు) లు కూడా ఒకటిగా ఉ ం ట ా యి ్ ం న ని ఎ ే ది క ్ సూచిస్తోంది. సముద్రంలోని తీవ్రమైన వేడి, కేరళ, ఏపీ తీరంలో అత్యధికంగా లభించే ఆయిల్ సార్డిన్ వంటి చిన్న చేపలను ప్రభావితం చేస్తుంది. శాస్త్రవేత్తలు అందించిన నివేదికల ప్రకారం, వేడి వాతావరణంలో సార్డిన్‌లు పునరుత్పత్తి సమస్యలతో బాధపడటం, వాటి గుడ్లు నశించపోవడం లేదా దెబ్బతినడం సర్వసాధారణం. సార్డిన్‌లు సాధారణంగా మే-జూన్ నెలల్లో గుడ్లు పెడతాయి. ఎల్ నినో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతను క్రమంగా పెంచుతున్నందున, సార్డిన్ గుడ్లు పొదిగి లార్వాలుగా మారే ప్రక్రియకు అంతరాయం కలుగుతుంది. దీని ఫలితంగా, గుడ్లు దెబ్బతినడంతోపాటు.. ఒకవేళ ఉత్పత్తి అయిన కవ్వళ్ల పిల్ల చేపలు వేడిని తట్టుకోలేక చనిపోతాయి. దీనికి తోడు, హెర్రింగ్ చేపల ప్రధాన ఆహారమైన సముద్రపు నాచు నాశనమవుతోంది. ఎల్ నినో కారణంగా, సముద్రపు అడుగుభాగం నుండి పోషకాలు అధికంగా ఉన్న నీరు పర్వతంలా పైకి వచ్చే పరిస్థితి బలహీనపడింది. ఈ సహజ ప్రక్రియను అప్‌వెల్లింగ్ అంటారు. దీనితో, సముద్రపు నాచు రాక బాగా తగ్గిపోయింది. హెర్రింగ్ (సముద్రంలో భారీ గుంపులుగా ప్రయాణించే చిన్న, వెండి రంగు చేప) చేపలు తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంటున్నాయి. ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ ఆహార కొరత ఏర్పడి, సంతానోత్పత్తికి అనువైన వాతావరణం కనుమరుగవడంతో, హెర్రింగ్‌లతో సహా సార్డినెస్ అలాగే ఇతర చేపలు చల్లని సముద్రాలకు తరలివెళ్లడం ప్రారంభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం మనం అనుభవిస్తున్న ఎల్ నినో ప్రభావం.. వచ్చే ఏడాది (2027) ఏప్రిల్, మే నెలల నాటికి కనబడతాయని వాతావరణ శాఖ అలాగే.. ఆహార నిపుణులు అంచనా వేస్తున్నారు. కొత్త చేపల ఉత్పత్తి లేకపోవడం వల్ల వచ్చే ఏడాది నాటికి సముద్రంలో తీవ్రమైన చేపల కొరత ఏర్పడే అవకాశం ఉందని సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చెబుతోంది. వీటన్నిటితో పాటు, పగడపు దిబ్బల విధ్వంసం వల్ల కలిగే పరిణామాలు కూడా ఉన్నాయి. చెంపల్లి (రెడ్ స్నాపర్) వంటి చేపలు తమ మనుగడ కోసం పగడపు దిబ్బలపై ఆధారపడి ఉంటాయి. లక్షద్వీప్ వంటి ద్వీపసమూహాలలో దీని పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి.. ఎందుకంటే పగడపు దిబ్బల విధ్వంసం భూమి క్షీణతకు కూడా దారితీయవచ్చు.

# పసిమొగ్గపై లైంగిక దాడి

బెంగాల్, జూలై 14,పశ్చిమ బెంగాల్‌లోని మేదినీపూర్ జిల్లాలో పసిమొగ్గపై జరిగిన లైంగిక దాడి ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల అమాయక చిన్నారిపై పాఠశాల ఆవరణలోనే బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ దారుణానికి ఒడిగట్టాడు. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు స్వయంగా స్కూల్ ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు ప్రయత్నించడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.!పశ్చిమ బెంగాల్‌లోని మేదినీపూర్ జిల్లాలో పసిమొగ్గపై జరిగిన లైంగిక దాడి ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల అమాయక చిన్నారిపై పాఠశాల ఆవరణలోనే బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ దారుణానికి ఒడిగట్టాడు. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు స్వయంగా స్కూల్ ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు ప్రయత్నించడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆరేళ్ల చిన్నారి ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్ళింది. స్కూల్ ముగిసిన తర్వాత తల్లి ఆమెను ఇంటికి తీసుకురావడానికి వెళ్లినప్పుడు, ఆ చిన్నారి తీవ్ర భయాందోళనలతో కలత చెంది కనిపించింది. ఇంటికి వచ్చిన తర్వాత భయపడుతూనే పాఠశాలలో జరిగిన ఘోరాన్ని తల్లిదండ్రులకు వివరించింది. తాను టాయిలెట్‌కు వెళ్లిన సమయంలో బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ తలుపు లోపల గడియ పెట్టి, బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డాడని చెప్పింది. ఆ సమయంలో నిందితుడి స్నేహితుడు వచ్చి బయటి నుండి తలుపు తట్టడంతో నిందితుడు చిన్నారిని వదిలేశాడు. లేకపోతే ఊపిరాడక స్పృహ కోల్పోయే స్థితికి ఆ చిన్నారి చేరుకుండేదని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ దారుణంపై చిన్నారి తల్లిదండ్రులు వెంటనే పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. అయితే, బాధితులకు న్యాయం చేయాల్సిన ప్రిన్సిపాల్.. నిందితుడిని సమర్థించే ప్రయత్నం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పాఠశాల పరువు పోతుందని బెదిరిస్తూ, వారిని కూడా ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నారు. పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ నిర్లక్ష్యపూరిత చర్యపై ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. స్కూల్ ఎదుట ఆందోళన తీవ్రం కావడంతో చివరికి పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, తక్షణమే అతడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పాపియా సుల్తానా స్పందిస్తూ.. బాధితురాలి వయసు, సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకుని మరిన్ని వివరాలను గోప్యంగా ఉంచుతున్నామని, తక్షణమే కఠిన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. మరోవైపు, నిందితుడిని కాపాడటానికి ప్రయత్నించిన ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుండి తొలగించాలని, బాధితులను హేళన చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన తోటి ఉపాధ్యాయులను కూడా సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో విద్యార్థుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది..

## కేటీఆర్ పాదయాత్ర పోస్ట్ పోన్..?

హైదరాబాద్, జూలై 14 తెలంగాణలో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పాదయాత్ర చేస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈ ఏడాది నుంచే ఆ పాదయాత్ర ప్రారంభం కావాల్సి ఉంది. దీనిపై కేటీఆర్ .. పార్టీలోనూ.. తన కుటుంబంలోనూ చర్చించినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. రాజకీయంగా పాదయాత్ర ఏమేరకు తమకు దోహదపడుతుందన్న విషయంపైనా ఆయన ఆరా తీశారు. అధికారంలోకి వచ్చేందుకు ఇది ఎంతవరకు ఉపయోగపడుతుందన్నది కూడా తెలుసుకున్నారు. పాదయాత్ర చేయడం ద్వారా తెలంగాణ ప్రజలకు చేరువ కావడం ఒక భాగమైతే.. మరోవైపు పార్టీని డెవలప్ చేసుకోవడం మరో లక్ష్యంగా ఉంది. ఈ నేపథ్యంలోనే పాదయాత్రకు కేటీఆర్ తొలిసారి ప్రాధాన్యం ఇస్తున్నారన్న చర్చ కూడా ఉంది. మరోవైపు కేసీఆర్ సైతం బస్సు యాత్ర చేస్తారని పార్టీ వర్గాలు ప్రకటించాయి. దీనిని కేటీఆర్ కూడా ఔననే చెప్పారు. సో.. అటు కేటీఆర్, ఇటు కేసీఆర్ ఏకకాలంలో ప్రజలను కలుసుకునేందుకు ప్రాధాన్యం ఇచ్చి.. తద్వారా మరోసారి అధికారంలోకి వచ్చే ప్రయత్నాలు చేయడం ఖాయమన్న బీఆర్ఎస్ వర్గాల మాట. అయితే? ఇప్పుడు రెండు యాత్రలు కూడా వాయిదా పడ్డాయని తెలుస్తోంది. ఈ ఏడాదే పాదయాత్ర ప్రారంభిస్తానని కేటీఆర్ చెప్పినప్పటికీ.. ప్రజల్లో ఆమేరకు అవసరమైన రాజకీయ పరిస్థితి కనిపించడం లేదని దీంతో ఇప్పుడు పాదయాత్ర చేసినా విఫల ప్రయత్నమే అవుతుందన్న ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డిపై ప్రజల్లో ఎక్కడా మోహం మొత్తలేదు. పైగా.. ప్రభుత్వ వాదన విషయంలో ప్రజలు అర్థం చేసుకుంటున్న పరిస్థితి కూడా కనిపిస్తోంది. దీంతో ఇప్పటికిప్పుడు సర్కారుపై వ్యతిరేకత లేదన్నది సుస్పష్టమవుతోంది. సహజంగా ఇలాంటి పాదయాత్రలు.. ప్రజల్లో సదరు ప్రభుత్వాలపై వ్యతిరేకత ప్రారంభమైనప్పుడు చేపడితే ఫలితం ఆశించినట్టుగా ఉంటుంది. కానీ, ఇప్పుడు తెలంగాణలో కేటీఆర్ ఆశించినట్టుగా వ్యతిరేకత కనిపించడం లేదు. ముఖ్యంగా రేవంత్ రెడ్డి విషయంలో మరింత సానుకూలంగానే వ్యవహరిస్తున్నారన్న పేరు వినిపిస్తుండడంతో తన పాదయాత్ర సహా కేసీఆర్ బస్సు యాత్రలను వచ్చే ఏడాదికి పోస్టు పోన్ చేసుకున్నారని తెలుస్తోంది. అయితే.. దీనిపై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

# ఓవైసీని భయపెడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

హైదరాబాద్, జూలై 14 మునుపెన్నడూ లేని విధంగా సాగుతున్న ఈ ఓటర్ల జాబితా ప్రక్షాళన, దశాబ్దాలుగా పాతబస్తీని తమ రాజకీయ సామ్రాజ్యంగా ఏలుతున్న మజ్లిస్ పార్టీకి, ముఖ్యంగా ఓవైసీ కుటుంబానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. క్షేత్రస్థాయిలో నకిలీ ఓట్లు, అక్రమ ఓట్ల వ్యవహారం ఈ ప్రత్యేక తనిఖీలతో వెలుగులోకి రాబోతుండటమే ఇందుకు ప్రధాన కారణమనే చర్చ జోరందుకుంది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా వంటి పాతబస్తీ నియోజకవర్గాల్లో ప్రతి ఎన్నికల్లోనూ అత్యంత తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుంటుంది. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా సగటు ఓటింగ్ 45శాతం నుండి 50శాతం లోపే ఉండటానికి ప్రధాన కారణం ఓటర్ల జాబితాలోని అడ్డగోలు లోపాలేనని ఈ నిరంతర తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో బూత్ లెవెల్ అధికారులు కేవలం ఆధార్ కార్డ్ లేదా ఏదైనా ఒక సాధారణ గుర్తింపు పత్రాన్ని చూసి ఓట్లు నమోదు చేసేవారు. దీనివల్ల ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓట్లు ఉండటం, చనిపోయిన వారి పేర్లు, గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి ఓట్లు కూడా జాబితాలో అలాగే ఉండిపోయాయి. ప్రస్తుత కఠినమైన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'లో అధికారులు పౌరసత్వం, స్థానికతను నిరూపించుకోవడానికి దశాబ్దాల నాటి మున్సిపల్ అసెస్‌మెంట్ రసీదులు, రిజిస్టర్డ్ సేల్ డీడ్స్ వంటి పక్కా లీగల్ డాక్యుమెంట్లు అడుగుతున్నారు. పాతబస్తీలో తరతరాలుగా నివసిస్తున్న మెజారిటీ ముస్లిం పేద కుటుంబాలు అద్దె ఇళ్లలోనో, సరైన పత్రాలు లేని పాత ఇళ్లలోనో ఉంటుండటంతో ఈ పత్రాలు చూపించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రక్రియ ముగిసేసరికి పాతబస్తీలో భారీ సంఖ్యలో బోగస్, బల్క్ ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఓట్ల గల్లంతు భయం వెనుక ఎంఐఎం పార్టీ ఉనికికి సంబంధించిన పెద్ద రాజకీయ సంక్షోభం దాగి ఉంది. పాతబస్తీలో పోలింగ్ శాతం తక్కువగా ఉన్నప్పటికీ, అక్కడ నమోదయ్యే లాయల్ ఓట్ బ్యాంక్, బల్క్ ఓటింగ్ ఆధారంగానే అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలు దశాబ్దాలుగా ఏకపక్ష విజయాలను సాధిస్తూ వస్తున్నారు. ఈ ప్రత్యేక ప్రక్షాళన వల్ల లక్షలాది ఓట్లు తొలగిపోతే, ఎంఐఎం సంప్రదాయ ఓట్ బ్యాంక్ ఛిన్నాభిన్నమవుతుంది. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సీట్ల సంఖ్య దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఓటర్ల జాబితాలో నకిలీలు ఏరివేస్తే, ఓవైసీ కుటుంబానికి పాతబస్తీపై ఉన్న తిరుగులేని రాజకీయ పట్టు సడలిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. తమ రాజకీయ కోటను కాపాడుకునేందుకు రంగంలోకి దిగిన ఎంఐఎం అగ్రనేత అసదుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహానికి తెరలేపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ దొరకకపోవడంతో, ఎంఐఎం ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 162ని ఉపయోగించి, కర్ణాటక ప్రభుత్వం సకల సేవల చట్టం-2011 కింద జారీ చేస్తున్నట్లుగా, ఇక్కడి ఓటర్లకు కూడా శాశ్వత నివాస ధృవీకరణ పత్రాలు లేదా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఓవైసీ డిమాండ్ చేస్తున్నారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న బ్లాక్‌మెయిల్ రాజకీయంగా విమర్శకులు అభివర్ణిస్తున్నారు. మరోవైపు, సీఎం రేవంత్ రెడ్డి ఈ శాశ్వత నివాస ధృవీకరణ డిమాండ్‌పై అత్యంత వ్యూహాత్మకంగా మౌనం వహిస్తున్నారు. తెలంగాణలో స్థానికత అనేది సెంటిమెంట్‌తో కూడిన అంశం కావడంతో, ఎంఐఎం అడిగినట్లు హడావుడిగా శాశ్వత నివాస పత్రాలు జారీ చేస్తే అది రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారానికి దారి తీస్తుంది, పైగా బీజేపీ దీనిని ప్రధాన ఆయుధంగా మార్చుకుంటుంది. చట్టపరంగా ఓటర్ల జాబితా సవరణ అనేది పూర్తిగా కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోని అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. ఏదేమైనా, ఈ స్పెషల్ రివిజన్ ప్రక్రియ పూర్తయ్యే సరికి పాతబస్తీ రాజకీయ చిత్రపటంలో ఓవైసీ మార్క్ ఏకపక్షాధిపత్యానికి బ్రేకులు పడటం ఖాయంగా కనిపిస్తోంది.

# ఒక్కసారిగా తగ్గిన సల్కం చెరువు విస్తీర్ణం దుమారం రేపుతున్న యూ-టర్న్

హైదరాబాద్, జూలై 14 హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే వినిపించిన 'చట్టం ఎవరికైనా ఒక్కటే' అనే నినాదం ఇప్పుడు పాతబస్తీ సల్కం చెరువు సాక్షిగా అభాసుపాలవుతోంది. పేదల ఇళ్లు, సామాన్య బిల్డర్ల భవనాలపై బుల్డోజర్లతో విరుచుకుపడే 'హైడ్రా' కన్ను, మిత్రపక్షమైన ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీకి చెందిన విద్యాసంస్థల దగ్గరకు వచ్చేసరికి మూతపడిందా? అనే అనుమానాలు బలపడుతున్నాయి. చాంద్రాయణగుట్ట బండ్లగూడ ఖల్సాలోని సల్కం చెరువు పరిధిలో ఉన్న బారిస్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ వివాదంలో తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో తీసుకున్న అనూహ్యమైన యూ-టర్న్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను దుమారం రేపుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం రాజకీయ ప్రయోజనాల కోసం నిబంధనలను ఎలా తుంగలో తొక్కిందో ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది. సల్కం చెరువు ఆక్రమణలపై అడ్వకేట్ విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్ వెనుక సుదీర్ఘ పొలిటికల్ అండ్ లీగల్ డ్రామా దాగి ఉంది. 2016 లో ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ప్రాథమిక సర్వే నోటిఫికేషన్ ప్రకారం.. సల్కం చెరువు వైశాల్యం దాదాపు 36 ఎకరాల ప్రభుత్వ భూమి. అప్పట్లో అధికారికంగా విడుదల చేసిన మ్యాపులు ఈ ఒవైసీ విద్యాసంస్థల భవనాలు స్పష్టంగా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నట్లు తేల్చిచెప్పాయి. కానీ, తాజా విచారణలో ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ కోర్టుకు సమర్పించిన మెమో చూసి స్వయంగా హైకోర్టే ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ విద్యాసంస్థలు అసలు ట్యాంక్ బెడ్ లేదా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే లేవంటూ ప్రభుత్వం క్లీన్ చిట్ ఇవ్వడం, మిషన్ కాకతీయ కింద చెరువు చుట్టూ రింగ్ బండ్ నిర్మించామని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వ నీతిని బట్టబయలు చేసింది. 2016 నాటి నోటిఫికేషన్‌కు భిన్నంగా ఇప్పుడు చెరువు వైశాల్యం ఎలా కుంచించుకుపోయింది? రాజకీయ ఒత్తిళ్లతో ఎఫ్‌టీఎల్ సరిహద్దులను మార్చడానికి గల కారణాలేంటని ప్రశ్నిస్తూ ఇరిగేషన్, రెవెన్యూ, హైడ్రా శాఖలను జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిలదీయడం ప్రభుత్వ వైఖరిని ఎండగడుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఎంఐఎం పార్టీతో అంతర్గతంగా నడుపుతున్న ఫ్రెండ్లీ బంధాన్ని కాపాడుకోవడానికే ఈ డిఫెన్సివ్ స్టాండ్ తీసుకున్నారనేది బహిరంగ రహస్యం. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డికి ఎంఐఎం పరోక్ష మద్దతు ఇస్తుండటంతో, పాతబస్తీ పెద్దలను నొప్పించకుండా ఉండేందుకు అధికారులు రీ-సర్వేల పేరుతో కాలయాపన చేసి, చివరకు నివేదికలనే మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "ఎంతటివారైనా సరే.. చెరువులను ఆక్రమిస్తే వదిలేది లేదు" అంటూ సీఎం రేవంత్ రెడ్డి బిల్డప్ ఇచ్చిన హైడ్రా బ్రాండ్ ఇమేజ్‌కు ఈ సల్కం చెరువు వ్యవహారం పెద్ద మచ్చగా మారింది. చట్టం అందరికీ ఒక్కటే అన్న సూత్రం అధికార పక్ష రాజకీయ అవసరాలకు లోబడి ఎలా మారిపోతుందో ఈ కేసు రుజువు చేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ పక్షపాత నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందిస్తూ.. కాంగ్రెస్ నాయకులకు ఉచిత కంటి పరీక్షలు చేయించాలని ఎద్దేవా చేశారు. ఓవైసీ కాలేజీ చెరువులోనే ఉందన్న విషయం ప్రపంచం మొత్తానికి స్పష్టంగా కనిపిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించట్లేదని విమర్శించారు. పేదల ఇళ్లను కూల్చడానికి వేగంగా వచ్చే హైడ్రా, మిత్రపక్షం అక్రమ నిర్మాణాల దగ్గరకు వచ్చేసరికి వెనకడుగు వేస్తోందన్నారు. కాంగ్రెస్ రాజకీయ రంగోలీ వేసిన ప్రతిచోటా ఎఫ్‌టీఎల్ లైన్లు మాయాజాలంతో మారిపోతాయని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ప్రభుత్వం ఓవైసీ విద్యాసంస్థలను కాపాడటానికి ఎన్ని ప్రహసనాలు ఆడినా, న్యాయస్థానం మాత్రం ఈ కేసును తేలికగా వదిలేలా లేదు. ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఈ కాలేజీకి అసలు అనుమతులు లేవని ఒకసారి, కేవలం ఇతర విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారని మరోసారి పరస్పర విరుద్ధ సమాధానాలు చెప్పడంపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పర్యావరణం, సహజ వనరుల రక్షణ ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశమని స్పష్టం చేస్తూ, అన్ని శాఖలు 3 వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ సర్కార్ నిబంధనలను తుంగలో తొక్కినా.. న్యాయస్థానం పర్యవేక్షణలో సల్కం చెరువు ఆక్రమణల నిజాలు త్వరలోనే పూర్తిగా బయటకు రావడం ఖాయంగా కనిపిస్తోంది.

# భగ్గుమన్న బిసి సంఘాలు

ఎల్బీనగర్ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై అనుచిత వాక్యలు చేసిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జక్కిడి శివ చరణ్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘం నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన ధర్నా చేపట్టి శివ చరణ్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు..ఈ సందర్భంగా పలు బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వెంటనే జక్కిడి శివశరణ్ రెడ్డిని సస్పెండ్ చేయాలని పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ను డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున రాస్తారోకలు ధర్నాలు చేపట్టి పోరాటం ఉధృతం చేస్తామన్నారు. దీంతో పది కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

# కాళేశ్వరం పై బీజేపీ కిం కర్తవ్యం...

హైదరాబాద్, జూలై 14 తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ ఇప్పుడు సరికొత్త రాజకీయ వ్యూహాలు, ప్రతివ్యూహాలు నడుస్తున్నాయి. ముఖ్యంగా ఈ వ్యవహారంలో బీజేపీ అనుసరిస్తున్న వైఖరి రాజకీయ వర్గాల్లో తీవ్ర గందరగోళానికి దారి తీస్తోంది. ఒకవైపు కేంద్రంలోని తమ ప్రభుత్వ పరిధిలోని సంస్థ ఇచ్చిన నివేదికకు భిన్నంగా రాష్ట్ర బీజేపీ నేతలు మాట్లాడుతుండడం, మరోవైపు దీనిని అధికార కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకుని విమర్శలు గుప్పించడంతో కాళేశ్వరం చుట్టూ రాజకీయం వేడెక్కింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టు భద్రతపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రంగంలోకి దిగి పరిశీలనలు జరిపింది. ప్రస్తుతానికి మేడిగడ్డ వద్ద నీటిని నిలపవద్దని, అలా చేస్తే బ్యారేజీ నిర్మాణానికి మరింత ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎన్డీఎస్ఏ స్పష్టమైన సిఫారసు చేసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ మార్గదర్శకత్వంలోనే ఈ సంస్థ పనిచేస్తోంది. అయితే, విచిత్రంగా రాష్ట్ర బీజేపీ నేతలు మాత్రం ఇందుకు భిన్నమైన డిమాండ్లను తెరపైకి తెస్తున్నారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ బహిరంగంగానే స్పందిస్తూ.. కాళేశ్వరంలో నీటిని నింపి, ఎత్తిపోయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అటు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు సైతం కాళేశ్వరంపై ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాయడం సంచలనంగా మారింది. కేంద్ర సంస్థ చెప్పినదానికి భిన్నంగా, రాష్ట్ర బీజేపీ నేతలు నీటిని నింపాలని కోరడం వెనుక ఉన్న వ్యూహం ఏంటో అర్థం కాక ఆ పార్టీ శ్రేణులే గందరగోళానికి గురవుతున్నారు. రాష్ట్ర బీజేపీ నేతల విమర్శలపై అధికార కాంగ్రెస్ పార్టీ అంతే దీటుగా స్పందిస్తోంది. తాము సొంత నిర్ణయాలు తీసుకోవడం లేదని, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్డీఎస్ఏ సిఫారసులనే తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని ప్రభుత్వం గట్టిగా వాదిస్తోంది. ఒకవేళ ఎన్డీఎస్ఏ నివేదికను కాదని నీటిని నిలిపితే, భవిష్యత్తులో బ్యారేజీకి ఏమైనా నష్టం జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. కేంద్ర సంస్థ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే లేనిపోని సాంకేతిక, చట్టపరమైన సమస్యలు వస్తాయని ప్రభుత్వం వివరిస్తోంది. బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. ఈ గందరగోళాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా పూర్తిగా వాడుకుంటోంది. బీఆర్ఎస్ చెప్పినట్లే బీజేపీ నేతలు ఆడుతున్నారంటూ కాంగ్రెస్ కొత్త పల్లవి అందుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్, వైఫల్యాలపై బీఆర్ఎస్ తీరును గతంలో తప్పుబట్టిన బీజేపీ, ఇప్పుడు అదే బీఆర్ఎస్ లైన్‌ను ఎందుకు అందుకుందని ప్రశ్నిస్తోంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే రంగంలోకి దిగి.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు రాసిన స్క్రిప్ట్ ప్రకారమే ఈటల రాజేందర్ నడుచుకుంటున్నారని సంచలన ఆరోపణలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్, బీజేపీల మధ్య అంతర్గత అవగాహన కుదిరిందనే అనుమానాలకు ఈ వైఖరే నిదర్శనమని కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. వాస్తవానికి కాళేశ్వరం అవినీతిపై బీఆర్ఎస్‌ను గద్దె దించుతామని గతంలో బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను టార్గెట్ చేసే క్రమంలో, బీఆర్ఎస్ వాదనకు బలం చేకూర్చేలా మాట్లాడడం ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఒకవైపు కేంద్ర సంస్థ నీళ్లు నిలపొద్దంటుంటే, మరోవైపు రాష్ట్ర నేతలు నీళ్లు నింపాలనడం ద్వంద్వ వైఖరిని సూచిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అంశంపై పార్టీలో సరైన సమన్వయం, స్పష్టత కొరవడిందని స్వయంగా బీజేపీలోని కొందరు ముఖ్య నేతలే అంతర్గత చర్చల్లో అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి, కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ ఎంత ఆలస్యమైతే అంత రాజకీయ ప్రయోజనం పొందాలని ఒకరు, కేంద్ర నివేదికలను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను కట్టడి చేయాలని మరొకరు చూస్తున్నారు. ఈ రాజకీయ చదరంగంలో బీజేపీ తీసుకుంటున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలు ఆ పార్టీకే తిప్పలు తెచ్చిపెట్టేలా కనిపిస్తున్నాయి.

# వెనక్కి తగ్గేది లేదంటున్న కవిత



హైదరాబాద్, జూలై 14 తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) పేరును మార్చుకోవాలంటూ.. కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన దరిమిలా.. ఆ పార్టీ చీఫ్ కవిత తాజాగా కేంద్ర ఎన్నికల సంఘానికి సుదీర్ఘ లేఖ రాశారు. తమకు అదే పేరు కావాలని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటి కే రాష్ట్ర వ్యాప్తంగా వంద నియోజకవర్గాలకు పైగా తమ పార్టీ పేరుతో జెండాలు ఎగురవేశామని.. ఇప్పుడు మార్చుకోమంటే ఎలా ? అని కవిత ప్రశ్నించారు. ఈ మేరకు కవిత పేరుతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ లేఖ సంధించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి పలు ప్రశ్నలు కూడా సంధించారు. తమ పార్టీ పేరును మార్చు కోవాలని వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని చెబుతున్న ఎన్నికల సంఘం ఆ అభ్యంతరాలను ఎవరు వ్యక్తం చేశారో.. చెప్పాలని కోరారు. ఆ లేఖలను కూడా తమకు పంపాలని పట్టుబట్టారు. ఎవరో ముక్కు మొహం తెలియని వారు రాసిన లేఖలను ఆధారంగా చేసుకుని పార్టీ పేరును మార్చుకోమని కోరడం సమంజసం కాదని పేర్కొన్నారు. పార్టీ పేరు విషయంలో గతంలో కేంద్ర ఎన్నికల సంఘం తమకు కొన్ని సూచనలు చేసిందని.. దాని ప్రకారమే పేరును మార్చుకున్నామని.. తెలంగాణ రక్షణ సేన పేరుతో 105 నియోజకవర్గాల్లో పార్టీ జెండాను కూడా ఆవిష్కరించామని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు తమకు అనుకూలంగా ఉన్నారని.. అలాంటప్పుడు పేరును మార్చుకోమని కోరడం సరికాదని తెలిపారు. ఇది తమ హక్కులకు భంగం కలిగించడమేనని పేర్కొన్నారు. ఇప్పటికే ఒకే రమమైన పేర్లతో అనేక పార్టీలు తెలంగాణలో ఉన్నాయని కూడా అనిల్ కుమార్ పేర్కొన్నా రు. తమకు మాత్రమే అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. తమ వైపు నుంచి కూడా కేంద్ర ఎన్నికల సంఘం ఆలోచన చేయాలని కోరారు. కాగా.. ఎన్నికల సంఘం సూచించిన గడువు.. సోమవారంతో ముగియనున్న నేపథ్యంలో పీపుల్ రిప్రజెంటేటివ్ యాక్ట్-1951 సెక్షన్ 29ం ప్రకారం.. తమ అభ్యర్థనను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# పరుగులు పెడుతున్న బుల్లెట్ ట్రైన్

హైదరాబాద్, జూలై 14 తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. దీనిలో భాగంగానే ఫ్యూచర్ సిటీ సహా బుల్లెట్ ట్రైన్, మెట్రో వ్యవస్థలను కీలకంగా తీసుకుంది. మెట్రో ను సైతం ప్రభుత్వమే కొనుగోలు చేసింది. దీనిని విస్తరించే ప్రతిపాదనను కూడా సర్కారు సిద్ధం చేసింది. ఇక, ఫ్యూచర్ సిటీని 14 వేల ఎకరాలకు పరిమితం చేయాలని అనుకున్నా.. ఇప్పుడు దాదాపు మరో 14 వేల ఎకరాలకు విస్తరించనుంది. మరోవైపు బుల్లెట్ రైల్ కారిడార్ ప్రతిపాదనలు కూడా రెడీ అవుతున్నాయి. ఇవన్నీ.. చెప్పుకొనేందుకు బాగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఏమేరకు సాకారం అవుతాయన్నది ప్రశ్నగా మారింది. దీనికి కారణం.. భూముల సమస్యే. అటు ఫ్యూచర్ సిటీ కోసం భూ సేకరణ (2013 నాటి చట్టం) చేపట్టాలని నిర్ణయించారు. కానీ, దీనికి అనుకున్న విధంగా ప్రజల నుంచి రెస్పాన్స్ రాలేదు. పైగా.. రాజకీయ జోక్యం పెరిగిందన్న టాక్ కూడా వినిపిస్తోంది. దీంతో భూసేకరణ వ్యవహారం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. ఇక, బుల్లెట్ ట్రైన్‌కు ఆదిలోనే రెడ్ సిగ్నల్స్ పడుతున్నాయి. బహదూర్‌పురలో భూములు ఇచ్చేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. పైగా ఈ భూముల్లోనే ఎక్కువగా పంటలు పండుతుండడంతో రైతులకు సెంటిమెంటుగా మారింది. దీంతో వారు సదరు భూములు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. ఇప్ప టికే చేపట్టిన సర్వేలో 30 శాతం మంది తమ భూములు ఇవ్వబోమని చెబుతున్నారు. ఒకవేళ భూములు కావాలంటే బహిరంగ ధరలకు కొనుగోలు చేయాలని చెబుతున్నారు. ఇది సర్కారుకు మరింత భారంగా మారనుంది. మెట్రో పరిస్థితి కూడా దాదాపు ఇలానే ఉంది. ఒకవైపు భూముల సమస్యలతో పాటు.. మెట్రో అలైన్‌మెంటు విషయంలో చోటు చేసుకున్న విమర్శలు రాజకీయంగా ఇరకాటంలోకి నెడుతున్నాయి. మరోవైపు కేంద్రం నుంచి ఆశించిన మేరకు సహకారం లేదని సీఎం రేవంత్ స్వయంగా చెబుతున్నారు. రుణం విషయంలోనూ సర్కారు స్పందించడం లేదని అంటున్నారు. ఈ పరిణామాలతో ఈ మూడు ప్రాజెక్టులు కూడా ఎక్కడి గొంగళి అక్కడే అన్నచందంగా మారడం గమనార్హం. కానీ, మరో రెండు సంవత్సరాల్లో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో వీటిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

# వర్షాలు లేక.. బిందెలతో పోలానికి నీళ్లు

శ్రీకాకుళం ఎల్నినో ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవక ఖరీఫ్ పంటలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. దీంతో ఎండిపోతున్న పైరును కాపాడుకునేందుకు రైతులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో కొందరు నీటి బిందెలతో వరి పైరును తడపగా భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో ట్యాంకర్ ద్వారా నీరు పెట్టిన హృదయవిదారక దృశ్యాలు కలచివేస్తున్నాయి.

# రేవంత్ ఐదున్నర ఏళ్ల సీఎం..

హైదరాబాద్, జూలై 14 రెండు తెలుగు రాష్ట్రాలలో గతంలో చూడని ముచ్చట రానున్న కాలంలో చూడబోతున్నామా అంటే జవాబు అవును అనే వస్తోంది. ఉమ్మడి ఏపీ కానీ అంతకు ముందు ఆ తరువాత విభజన ఏపీలో తెలంగాణాలో కానీ అయిదేళ్ళ సీఎంలను ఇంకా చెప్పాలంటే అంతకు తక్కువ పదవీ కాలం పనిచేసిన ముఖ్యమంత్రులనే అంతా చూశారు. అతి తక్కువ కాలం పనిచేసిన నెల రోజుల సీఎం గా నాదెండ్ల భాస్కరరావు ఒక రికార్డు క్రియేట్ చేశారు. ఇపుడు అయిదున్నరేళ్ళకు పైగా సీఎం గా పనిచేసి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త రికార్డు క్రియేట్ చేయబోతున్నారా అంటే రేవంత్ రెడ్డి మాటలను బట్టి చూస్తే జరగబోయేది అదే అని అర్ధం అవుతోంది ఆరు నెలలు ముందుకు : రేవంత్ రెడ్డి తాజాగా ఖమ్మం జిల్లాలో జరిగిన సభలో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఎన్నో ఆలోచనలు ప్రశ్నలు చర్చలకు తావిస్తున్నాయి. ఆయన ఈ సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణాకు షెడ్యూల్ ప్రకారం 2028 డిసెంబర్ లో ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే ఈ ఎన్నికలు 2029 మే లేదా జూన్ లో జరుగుతాయని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఈ లెక్కన చూస్తే మరో ఆరేడు నెలల పాటు తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని అర్ధం అవుతోంది. అంతే రేవంత్ రెడ్డి ఏకంగా అయిదున్నర ఏళ్ళకు పైగా ముఖ్యమంత్రిగా ఉంటారని కూడా దీనిని బట్టి చెప్పుకోవాల్సి ఉంటుంది.అదే జరిగితే తెలంగాణాలో విపక్షాలకు అది భారీ షాక్ అని చెప్పాల్సి ఉంటుంది. విపక్షాలు అంటే బీజేపీ కాదు, బీఆర్ఎస్ అని కూడా ఇక్కడ భావించాలి. ఎందుకంటే బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఆ పార్టీ తలచుకుంటేనే తెలంగాణాలో సార్వత్రిక ఎన్నికలు మరో ఆరు నెలల పాటు పొడిగించబడతాయి. దాంతో మరో రెండేళ్ళు ఆగండి మనదే ప్రభుత్వం అని తరచూ బీఆర్ఎస్ అగ్ర నేతలు జనాలకు పార్టీ జనాలకు చెబుతున్నారు. ఇపుడు వారే దిగాలు పడాల్సి ఉంటుంది. రాజకీయాల్లో ప్రతీ క్షణం విలువ అయినదే. అలాంటిది ఏకంగా ఆరేడు నెలలు కాంగ్రెస్ కి అదనంగా కలసి వస్తే కనుక కచ్చితంగా తెలంగాణా రాజకీయ సమీకరణలనే అది సమూలంగా మార్చేసే చాన్స్ ఉంటుంది. అలాంటపుడు మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశమూ ఉండొచ్చు. ఏది ఏమైనా రేవంత్ రెడ్డి చెప్పిన ఈ మాటలు అయితే ఇపుడు తెలంగాణా రాజకీయాల్లో బిగ్ డిబేట్ గా మారబోతున్నాయని చెప్పక తప్పదు. దేశంలో ఇందిరమ్మ తరువాత : ఇక రేవంత్ రెడ్డి అన్న మాట ప్రకారమే తెలంగాణాలో అసెంబ్లీ ఎన్నికలు మరో ఆరు నెలల పాటు పొడిగించబడితే మాత్రం కచ్చితంగా రేవంత్ రెడ్డి రికార్డు క్రియేట్ చేసినట్లే. దేశంలో ఆరేళ్ళ పాటు ప్రధానిగా ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ టైం లో పనిచేశారు. ఆ విధంగా రేవంత్ రెడ్డి కూడా అయిదేళ్ళకు మించి అయిదున్నరేళ్ళ పాటు సీఎం గా పనిచేస్తే అది ఎప్పటికీ బ్రేక్ చేయలేని రికార్డుగా ఉండే అవకాశం ఉంది. ఏది ఏమైనా రేవంత్ రెడ్డి తాజా సభలో చేసిన సంచలన కామెంట్స్ బిగ్ డిబేట్ కి దారి తీస్తున్నాయి. మరి దీని మీద బీఆర్ఎస్ నేతలు ఎలా రియాక్ట్ అవుతారో చూడాల్సిందే.

కేరాఫ్ ఎంహెచ్ ఆర్డీ భవన్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ చతురతను మరోసారి చాటుకున్నారు. ఎంసీహెచ్ఆర్డీలో నిర్మించిన తన క్యాంపు ఆఫీసును మీడియా అందరికీ చూపించారు. బీఆర్ఎస్ చేస్తున్న అల్ట్రా లగ్జరీ..వందల కోట్ల బడ్జెట్ వంటి ఆరోపణలకు లైవ్ స్పందన ఇచ్చారు. మీడియా ప్రతినిధులతో పాటు తాను కూడా స్వయంగా వారితో పాటు తిరిగారుఈ వ్యతిరేక ప్రచారాలకు చెక్ పెట్టాలని భావించిన సీఎం రేవంత్ రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఎలాంటి దాపరికం లేదనే సంకేతాన్ని ఇస్తూ.. ఏకంగా మీడియా ప్రతినిధులందరినీ స్వయంగా నూతన క్యాంపు ఆఫీస్ ప్రాంగణంలోకి తీసుకెళ్లి ప్రతి విభాగాన్ని చూపించారు. భవనం లోపల ఉన్న ఇంటీరియర్ డిజైన్ల నుండి ప్రతీ చిన్న విషయాన్ని జర్నలిస్టులకు దగ్గరుండి వివరించారు. లగ్జరీ హంగులు, ఆర్భాటాలు లేకుండా ఒక సాదాసీదా మధ్యతరగతి ఇల్లు ఎలా ఉంటుందో, ఈ ప్రభుత్వ భవనం కూడా అలాగే ఉందనే విషయాన్ని కళ్లారా చూసేలా మీడియాకు స్పష్టమైన విజువల్స్ అందించారు. ముఖ్యంగా నివాస నిబంధనల పరిధిలోనే, పరిపాలనకు అవసరమైన రీతిలో మాత్రమే నిర్మాణం జరిగిందని రుజువు చేశారు.జర్నలిస్టులను స్వయంగా రెస్ట్‌రూమ్ వరకు తీసుకెళ్లిన ఆయన.. గత కేసీఆర్ పాలనలో కట్టిన ప్రగతి భవన్ లాగా నా ఆఫీసులో ఎలాంటి బుల్లెట్‌ప్రూఫ్ బాత్‌రూమ్స్ లేవు అంటూ సెటైర్లు వేశారు. గతంలో ప్రగతి భవన్ చుట్టూ ఉన్న ఇనుప కంచెలు, బుల్లెట్‌ప్రూఫ్ కిటికీలు, బాత్‌రూమ్‌ల గురించిన తీవ్రమైన వివాదాలను గుర్తు చేస్తూ.. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో అలాంటి రహస్యాలు, విలాసాలు ఏవీ లేవని మీడియా సాక్షిగా నిరూపించారు. బీఆర్ఎస్ చేస్తున్న విలాసవంతమైన భవనమనే ఆరోపణల్లో ఎలాంటి సత్యం లేదని తేల్చిచెప్పారు. వ్యూహాత్మకంగా సాగిన ఈ మీడియా టూర్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ఒకే దెబ్బకు రెండు పిట్టలను కొట్టినట్లయింది. ఒకవైపు ప్రతిపక్షం లేవనెత్తిన భవన వ్యయం, విలాసాల గాసిప్స్‌కు క్షేత్రస్థాయి ఆధారాలతో అడ్డుకట్ట వేయగా.. మరోవైపు ఈ ఆఫీసు వల్ల చుట్టుపక్కల ఉండే సామాన్య ప్రజలకు, రాకపోకలు సాగించే వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవనే క్లారిటీని ఇచ్చారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని చాటిచెబుతూ, గత పాలకుల రహస్య వైభవానికి.. ఇప్పటి ప్రజా ప్రతినిధుల సరళత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజల ముందుంచడంలో రేవంత్ రెడ్డి మార్క్ పొలిటికల్ స్ట్రాటజీ పూర్తిగా సక్సెస్ అయిందని అనుకోవచ్చు.

## ఘనంగా మల్లు రవి జన్మదిన వేడుకలు

హైదరాబాద్ నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి పుట్టిన రోజు వేడుకలు జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10 ఎంపీ ఎమ్మెల్యే కాలనీ లోని ఆయన నివాసం వద్ద మంగళవారం ఘనంగా జరిగాయి. మాజీ టిటిడి బోర్డు సభ్యుడు ఎస్బి మోహన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పుట్టినరోజు వేడుకల్లో ఎంపీ మల్లురవి భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నగరం తో పాటు, నాగర్ కర్నూల్, మహబూబ్నగర్ ప్రాంతాల నుంచి కార్యకర్తలు నేతలు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి విచ్చేసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రాజ్యాంగం గొప్పతనాన్ని చెప్పే పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబ్నగర్ టిపిసిసి అధ్యక్షుడు సంజు ముదిరాజ్, బాలరాజు గౌడ్, లక్ష్మణ్ గౌడ్, మసూద్ హుస్సేన్, తేజ, కొండల్, రవీందర్ రెడ్డి, ప్రేమ్, అజహర్, ఖాజా, రాములు తదితరులు పాల్గొన్నారు.

## క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం.. విద్యార్థిని దుర్మరణం

సత్తెనపల్లి పేరేచర్ల – కొండమోడు రహదారి విస్తరణ పనుల్లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ పరిధిలోని నలంద కాలేజీ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న ఓ విద్యార్థినిని.. గత రాత్రి రోడ్డు పనుల నిమిత్తం వచ్చిన క్రేన్ బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలికను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.అప్పటికే ఆమె పరిస్థితి విషమించి కన్నుమూసింది.రహదారి పనులు జరుగుతున్న సమయంలో క్రేన్ డ్రైవర్ కనీస జాగ్రత్తలు తీసుకోలేదని, పక్కనే వెళ్తున్న బాలికను గమనించకుండా అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ఘోరం జరిగిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు.ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రహదారి పనుల వద్ద కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

### శిక్షణ ఉత్తమ విద్యాబోధనకు ఉపయోగపడుతుంది.

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.

జయశంకర్ భూపాలపల్లి. ఉపాధ్యాయులకు శిక్షణ ఉత్తమ విద్యాబోధనకు ఉపయోగతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్ మండలంలోని తెలంగాణ మోడల్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో కాటారం, మొగుళ్లపల్లి, మహాముత్తారాం, భూపాలపల్లి మండలాల జడ్పి, కెజిబివి, మోడల్ పాఠశాలలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్స్ ఇస్తున్నఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ ఫర్ క్వాలిటీ లెర్నింగ్ టు ట్రాన్స్ నేటివ్ క్లాస్ రూమ్స్ ?శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం అయన పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఆధునిక సాంకేతికతను అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించే దిశగా బోధన అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులను సరైన దిశలో నడిపిస్తూ, భావి భారతానికి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల ముఖ్య బాధ్యత అని తెలిపారు.విద్యాబోధనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం కీలకమైందని, దీని ద్వారా బోధనలో నాణ్యత పెరిగి విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలు పెరిగి మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. జిల్లాలో ఇప్పటికే 6 పాఠశాలల్లో విద్యార్థులకు ఏఐ శిక్షణ అందించామని, త్వరలో మరిన్ని పాఠశాలలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. గుణాత్మక విద్య సామర్థ్యవంతమైన ఉపాధ్యాయుల ద్వారానే సాధ్యం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాల పెంపుఆధునిక బోధనా పద్ధతులు, సరికొత్త అధ్యాపన విధానాలు, తరగతి నిర్వహణపై శిక్షణ అవసరమని తెలిపారు. శిక్షణ సృజనాత్మక మరియు నాణ్యమైన బోధనకు మార్గదర్శనమని తెలిపారు విద్యార్థుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఉపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, మైనారిటీ సంక్షేమ అధికారి డా కుమారస్వామి, వ్యవసాయి అధికారి బాబూరావు, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపిడిఓ భాస్కర్, ఎఎంఓ విజయ్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 200 కిలోల గంజాయి రవాణా కేసు..

## సత్తెనపల్లికి చెందిన ఇద్దరి అరెస్ట్



సత్తెనపల్లి: అనకాపల్లి జిల్లాలో వెలుగుచూసిన గంజాయి అక్రమ రవాణా కేసులో సత్తెనపల్లికి చెందిన ఇద్దరు యువకులను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వాహనాల తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపేందుకు పోలీసులు ప్రయత్నించగా, అందులో ఉన్న వ్యక్తులు వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు సమాచారం. తనిఖీలు నిర్వహించిన పోలీసులు కారులో సుమారు 200 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చేపట్టిన దర్యాప్తులో ఈ అక్రమ రవాణాలో సత్తెనపల్లికి చెందిన ఇద్దరు యువకుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించి మరికొంత మంది పాత్రపై కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

## సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో

## మంత్రి నారాయణ సమావేశం



అమరావతి సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో మంత్రి నారాయణ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సింగపూర్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ మంత్రిత్వ శాఖ సీనియర్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ చాంగ్,సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్ప్రైజ్ ప్రతినిధులు పాల్గొన్నారు. అమరావతి నిర్మాణంలో వివిధ రంగాల్లో సహకారం అందించేందుకు సింగపూర్ ప్రతినిధులు ముందుకొచ్చారు. వివిధ ప్రాజెక్టుల నిర్మాణంలో సింగపూర్ అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం,శిక్షణతో పాటు సలహాలు,సూచనలు సింగపూర్ ప్రభుత్వం అందించనుంది. ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మాణం చేయడానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని సింగపూర్ ప్రతినిధులు వెల్లడించారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసు

### మాజీ ఐపిఎస్ ఏబీకి విచారించిన సిట్

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసు లో విచారణ కొనసాగుతోంది. మంగళవారం నాడు ఏపీ క్యాడర్కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి ఏ బీ వెంకటేశ్వరరావును సిట్ విచారించింది. కేసులో సాక్షిగా ఏ బీ .వెంకటేశ్వరరావు స్టేట్మెంట్ రె సిట్ అధికారులు. నమోదు చేసారు. ఈ కేసులో ఇతర రాష్ట్ర మాజీ అధికారిని తొలిసారి సిట్ విచారించింది.

## క్యూ లైన్ల ఆకస్మిక తనిఖీ



శ్రీశైలం శ్రీశైల ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు మంగళవారం క్యూలైన్లు, విరాళాల కేంద్రాన్ని ఆకస్మికనీగా తనిఖీ చేశారు. ఆయా దర్శనటికెట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు మాట్లాడుతూ భక్తులకు సౌకర్యవనీతమైన దర్శనం కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

క్యూ లైన్లలో ఎటువంటి తొక్కిసలాట జరుగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సంబంధిత సిబ్బంది ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ దర్శనం క్యూలైన్లను నిర్వహిస్తుండాలన్నారు. అధికారులు పరస్పర సమన్వయముతో విధులు నిర్వర్తించాలన్నారు.

భక్తుల రద్దీ సమయంలో ముఖ్యంగా వారాంతపు సెలవులు పర్వదినాలలో క్యూ లైన్ల నిర్వహణ పట్ల మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు క్యూ లైన్లలో నిరంతరం మంచినీరు, అల్పాహారనీ అందిస్తుండాలని అధికారుకు సూచించారు. దర్శనము వేళలు, దర్శనాలకు పట్టే సమయం మొదలైన అంశాలను నిరంతరం ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా ప్రసారం చేస్తుండాలన్నారు. క్యూ లైన్లు, క్యూకాంప్లెక్స్ లో లైట్లు, ఫాన్లు, సజావుగా పనిచేసే విధంగా సంబంధించిన సిబ్బంది పర్యవేక్షిస్తుండాలన్నారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ వైరింగులకు ఎప్పటికప్పుడు అవసరమైన తగు మరమత్తులు చేస్తునీడాలన్నారు.

అయన భక్తులతో నేరుగా మాట్లాడారు. దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను గురించి భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా దర్శనము ఏర్పాట్లు, మంచినీటి సరఫరా, ప్రసాద వితరణ , పారిశుద్ధ్యనిర్వహణ గురించి భక్తులతో మాట్లాడారు.

### వరంగల్ ఎయిర్పోర్టుపై కీలక ప్రకటన




న్యూఢిల్లీ వరంగల్ (మామునూరు) ఎయిర్పోర్ట్ పనులను వేగవంతం చేస్తామని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం రికార్డు సమయంలో 253 ఎకరాల భూమిని అప్పగించడాన్ని ఆయన అభినందించారు. కాకతీయ కళా వైభవంతో నిర్మించే ఈ ఎయిర్పోర్టును 2028, జూన్ 2 నాటికి పూర్తి చేస్తామన్నారు. అలాగే ఆదిలాబాద్లో డిఫెన్స్–సివిలియన్ ఎయిర్పోర్ట్ నిర్మిస్తామని మంత్రి వెల్లడించారు.

#### ఓటరు సవరణ ప్రక్రియను పరిశీలించిన మంత్రి పొన్నం

హైదరాబాద్ హైదరాబాద్లో ఓటరు సవరణ ప్రక్రియను హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్తో కలిసి బోరబండలో పర్యటించిన మంత్రి, అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా బీఎల్ఏలు, బీఎల్వోలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా నింపాలని, జూలై 24తో గడువు ముగియనున్న నేపథ్యంలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, బీఎల్వోలపై దాడులు చేయకుండా ప్రజలంతా సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

## "జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్" రాష్ట్ర చైర్మన్‌గా డాక్టర్

# "ధూళిపాళ్ల భరత్ కుమార్" ఏకగ్రీవ ఎన్నిక



పిడుగురాళ్ళ, :ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ద్వైవార్షిక ఎన్నికలు –2026లో జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్ రాష్ట్ర చైర్మన్ (2026?2028) పదవికి పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ వైద్యులు ధూళిపాళ్ళ భరత్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాలను ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ చైర్మన్ డాక్టర్ జి.ఎస్.మూర్తి అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం డాక్టర్ ధూళిపాళ్ల భరత్ కుమార్ ఐఎంఏ పిడుగురాళ్ళ శాఖ అధ్యక్షులుగా, ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా, ఐఎంఏ సీజీపీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్స్ ఇన్ డయాబెటాలజీ (సీసీడీ ?2025?26) కన్వీనర్‌గా, ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్టాండింగ్ కమిటీ ఆన్ యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏ ఎం ఆర్ ) ఇనిషియేటివ్ కమిటీ కన్వీనర్‌గా, అలాగే పల్నాడు జిల్లా జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ధూళిపాళ్ళ భరత్ కుమార్ నవంబర్ 22న అమలాపురంలో జరగనున్న ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్షిక మహాసభలో జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్ రాష్ట్ర చైర్మన్‌గా అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ భరత్ కుమార్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఐఎంఏ రాష్ట్ర నాయకత్వానికి, ఎన్నికల కమిషన్‌కు, అలాగే మాజీ రాష్ట్ర అధ్యక్షుల వేదికకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జూనియర్ వైద్యులే వైద్య వృత్తి భవిష్యత్తు అని పేర్కొంటూ, రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసి, యువ వైద్యుల విద్యా, వృత్తి, నాయకత్వ వికాసానికి సమర్థ వంతమైన వేదికగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన పదవీకాలంలో చేపట్టనున్న ముఖ్య కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన మీడియాకు వివరించారు. 1) రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలలు, ఐఎంఏ స్థానిక శాఖల్లో జేడీఎన్ యూనిట్ల ఏర్పాటు, బలోపేతం. 2) జూనియర్ వైద్యుల్లో ఐఎంఏ సభ్యత్వం, జేడీఎన్ సభ్యత్వం విస్తరణ. 3) కెరీర్ గైడెన్స్, నాయకత్వ శిక్షణ, శాస్త్రీయ సదస్సులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ. 4) మెడికో–లీగల్ అవగాహన, పరిశోధన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వైద్య నైతిక విలువలపై శిక్షణ. 5) జూనియర్ వైద్యులు ఎదుర్కొంటున్న ఆసుపత్రి భద్రత, వైద్యులపై హింస, మానసిక ఒత్తిడి, ఉద్యోగ, వృత్తి అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ. 6) రాష్ట్ర వ్యాప్తంగా యువ వైద్యుల మధ్య సమన్వయం, మెంటార్‌షిప్, డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాల ప్రోత్సాహం అని తెలిపారు. తాను బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాష్ట్రంలోని జూనియర్ వైద్యుల సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రత్యేక సర్వే నిర్వహించి, వాటి ఆధారంగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఐఎంఏ రాష్ట్ర నాయకత్వం, సీనియర్ వైద్యులు, వైద్య కళాశాలల అధ్యాపకులు, రెసిడెంట్ డాక్టర్లు, యువ వైద్యుల సహకారంతో జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్‌ను రాష్ట్రంలో ఆదర్శవంతమైన వేదికగా తీర్చిదిద్ది, భావి ఐఎంఏ నాయకత్వాన్ని తయారు చేసే శక్తివంతమైన సంస్థగా అభివృద్ధి చేస్తానని డాక్టర్ ధూళిపాళ్ల భరత్ కుమార్ తమ విశ్వాసం వ్యక్తం చేశారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయిన మునిసిపల్ ఏఈ



పెద్దపల్లి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ కల్లెపల్లి సతీష్ కుమార్ రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఈ నేపథ్యంలో ఈఏ ఇంట్లో రూ.32.31 లక్షల అక్రమ నగదు స్వాధీనం చేసుకున్నారు. మున్సిపాలిటీ అసిస్టెంట్ ఇంజనీర్ కల్లేపల్లి సతీష్ కుమార్ను కాంట్రాక్టర్ బిల్లు ప్రాసెస్ చేసి టీయూఎఫ్ఐడీసీకి పంపేందుకు రూ.2 లక్షల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా కరీంనగర్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు...నిందితుడి వద్ద నుంచి లంచం నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇంటి సోదాల్లో రూ.32.31 లక్షల లెక్కల్లో చూపని నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు.. నిందితుడిని అరెస్ట్ చేసి ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచారు.

# వర్షాలు లేక ఎండిపోయిన మొక్కజొన్న, పత్తి,వరి పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి:సిపిఐ




కొత్తపల్లి మండలంలోని అన్ని గ్రామాలకు మొక్కజొన్న వరి పత్తి తదితర పంటలకు వర్షాలు లేనందువలన అధిక ఎండలకు ఎండిపోయినాయి కావున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఈరోజు మండల కేంద్రం అయినా కొత్తపల్లె తాసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వోకి రైతుల సమక్షంలో కొత్తపల్లి సిపిఐ మండల కార్యదర్శి కేత్ం వెంకట్ శివుడు యాదవ్ తాసిల్దార్ మేడమ్ గారికి రైతులతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. అలాగే కొత్తపల్లె మండలాన్ని తక్షణమే కరువు మండలముగా ప్రకటించాలని ఎమ్మార్వో ని కోరడం జరిగింది. ఇప్పటికే వర్షాలు లేక వేసిన పంటలు పాస్కోలేక రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాలెం నాగిరెడ్డి, రమణయ్య, కేత్ం శ్రీనివాసులు, ఆటో బుజ్జన్న, షబ్బీరు ఏఐటిసి కార్యదర్శి భీమలింగం, రైతు సంఘం కార్యదర్శి చిన్న ఏసేపు, లింగమయ్య,బాలకృష్ణ, జయరాం,గోవిందు, వెంకట లింగం,అంజి,లింగేశ్వరుడు , నరసింహుడు, తదితరులు పాల్గొన్నారు.


## విధి నిర్వహణలో రవాణా శాఖ కానిస్టేబుల్ అశోక్ కు త్రివ గాయాలు.

## ఇసుక మాఫియా పై చర్యలు భాగంగా ప్రమాదం.

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై14 ప్రజాబలం:**అక్రమ ఇసుక రవాణాపై చర్యలు చేపట్టిన రవాణాశాఖ సిబ్బందికి ఖమ్మంలో ప్రమాదం చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న రవాణా శాఖ కానిస్టేబుల్ అశోక్ తీవ్రంగా గాయపడిన సంఘటన రవాణా శాఖలో ఆందోళనకు గురిచేస్తుంది. మంగళవారం ఉదయం ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయం సమీపంలో రవాణా శాఖ ఇన్చార్జి డిటిఓ శ్రీనివాస్ తన బృందంతో కలిసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు 3 టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలిస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విధులు నిర్వహిస్తున్న రవాణా శాఖ కానిస్టేబుల్ అశోక్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఖమ్మం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన అశోక తో పాటు ఇన్చార్జి డిటిఓ శ్రీనివాస్ కూడా హైదరాబాద్ వెళ్లి చికిత్సలు ప్రవేశిస్తున్నారు. ఘటన విషయం తెలుసుకున్న రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి చికిత్సలు పర్యవేక్షించారు.

# బస్తీ దవాఖాన లో చికిత్స సౌకర్యాలు మెరుగుపరచాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్




హైదరాబాద్ జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ వినాయకనగర్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్ జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంకా అలా, డిఎంహెచ్ వో శ్రీనివాస్ మెడికల్ ఆఫీసర్ డా,, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ముందుగా మంత్రి బస్తీ దవాఖాన పరిశీలించారు. రోగులకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బస్తీ దవాఖాన లో ప్రతి రోజు 100–150 ఓపీ వస్తుందని మంత్రి గారి దృష్టికి తీసుకొచ్చారు.. దవాఖాన లో ఓపీ సంఖ్య పెంచాలని రోగుల పట్ల దయనీయంగా వ్యవహరించాలని సూచించారు. స్వయంగా షుగర్ టెస్ట్ , బ్లడ్ టెస్ట్ ,బీపీ టెస్ట్ చేసుకున్నారు. .బస్తీ దవాఖాన లో రోగులకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు లేదు అనకుండా చేయాలని అధికారులను ఆదేశించారు.

బస్తీ దవాఖాన లో చికిత్స సౌకర్యాలు మెరుగుపరిచి ప్రజల్లో నమ్మకం కలిగించే హైదరాబాద్ లో ఉన్న 169 బస్తీ దవాఖాన లకు ప్రత్యేక అధికారులను నియమించామని వారు బస్తీ దవాఖాన లో విజిట్ చేసి రోగుల కు అందుతున్న చికిత్స ,హాస్పిటల్ మౌలిక సదుపాయాలు, ఓపీ సంఖ్య పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఒక నివేదిక అందించాలని ఆదేశించారు.

హైదరాబాద్ బస్తీ దవాఖాన లు రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండేలా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వద్ద అవసరమైన చర్యలు తీసుకునేలా ఈ కార్యక్రమం చేపట్టారు.

## జులై 13 వంద సంవత్సరాలకు వచ్చే రోజున ప్రత్యేక పూజలు



కొత్తపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీ పార్వతీదేవి సమేత శ్రీ తాండవ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో సామి అమ్మవార్లకు ప్రత్యేకంగా ఈరోజు అభిషేక పూజలు కుంకుమార్చన రుద్రాభిషేకం తదితర పూజా జరిగాయి అనంతరం గ్రామంలోని మహిళలు పిల్లలు పెద్దలు అందరు కలిసి కార్యకర్తలు స్వామి వారికి సమర్పించి దర్శించుకున్నారు. జులై 13.. వందేళ్లకు ఒకసారి వచ్చే రోజుజూలై 13న అత్యంత అరుదైన 'మహాశైవాక్షయోగం' ఏర్పడుతోంది. వందేళ్లకోసారి వచ్చే ఈ రోజున శివారాధన చేయడం వల్ల విశేష ఫలితాలు ఉంటాయని పురోహితులు చెబుతున్నారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం చేయడం వల్ల సకల పాపాలు తొలగి, సుఖసంతోషాలు చేకూరుతాయని సూచిస్తున్నారు. భక్తితో చేసే చిన్న పూజ కూడా శివుడి అనుగ్రహాన్ని కలిగిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వివరిస్తున్నారు.

# త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఇ.యస్.ఐ ఆసుపత్రి సమస్యలు, అవసరాలపై చర్చిస్తా - ఎంపీ కేశినేని చిన్ని

### ఇ.యస్.ఐ ఆసుపత్రి ని పరిశీలించిన ఎంపీ చిన్ని

### త్వరలో అత్యాధునిక హంగులతో మరింతగా ఇ.యస్.ఐ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తానని హామీ

### విజయవాడ( తూర్పు నియోజకవర్గం, గుణదల,ఇ.యస్.ఐ ఆసుపత్రి)

విజయవాడ తూర్పు నియోజకవర్గం లోని గుణదల ప్రాంతంలో ఉన్న ఇ.యస్.ఐ ఆసుపత్రిని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో అందించే వైద్య సేవలు ఉన్న సౌకర్యాలు మరియు సదుపాయాలపై ఎంపీ చిన్ని ఆరా తీశారు. నేరుగా పేషెంట్స్ వార్డులో ఉన్న రోగుల వద్దకు వెళ్లి అక్కడ వారికి అందుతున్న వైద్య సేవలపై మాట్లాడారు ప్రతి వార్డుకు వెళ్లి ఆసుపత్రి మొత్తాన్ని పరిశీలించారు. ఆసుపత్రి సిబ్బంది కావలసిన అవసరాలు ఉన్నటువంటి సమస్యలు ను సైతం అడిగి తెలుసుకొని పలు సలహాలు సూచనలు చేశారు ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ విజయవాడలో ఇ.యస్.ఐ డిపార్ట్మెంట్ హాస్పిటల్ సుమారుగా 1968 లో ప్రారంభించారు సుమారుగా 3 లక్షల కార్డు హోల్డర్స్ ఇక్కడ సేవలను వినియోగించుకుంటున్నారని కొత్తగా మొన్నటి వరకు బేస్ శాలరీ 21 వేల వరకే ఈఎస్ఐ కార్డ్ హోల్డర్ల కింద ఎలిజిబిలిటీ ఉండేదని కేంద్ర ప్రభుత్వం 42 వేల వరకు తీసుకు వెళ్లడం జరిగిందని అన్నారు ఈరోజు ఉన్న కార్డు హోల్డర్ల కన్నా సుమారు రెండు నుంచి మూడు రెట్లు పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు ఇటువంటి ప్రతిష్టాత్మక సంస్థని ఈరోజు పరిశీలించడం జరిగిందని ఇక్కడ సిబ్బందికి ఎలాంటి అవసరాలు ఉన్నాయని వాటి మీద దృష్టి పెట్టి రేపు 20వ తారీకు నుంచి జరగబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాలన్నిటినీ ప్రస్తావిస్తానని తెలియజేశారు సమస్యలు ఏమున్నా మంత్రులు మరియు సెక్రటరీల దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. చాలా చక్కగా శుభ్రంగా ఆసుపత్రిని మెయింటైన్ చేస్తున్నారని ఇక్కడ సేవలు అందరి చోట 21 హాస్పిటల్ కి రిఫరల్ కూడా చేస్తున్నారని అన్నారు మూడు లక్షల కార్డు హోల్డర్లు ఉన్న ఇ.యస్.ఐ కార్పొరేషన్ కి ఎక్కడైనా కూడా సుమారు 300బెడెడ్ ఆసుపత్రి ఉండాలని మొన్ననే 155 బెడెడ్ హాస్పిటల్ శాంక్షన్ చేయడం జరిగిందని దీన్ని 300 బెడెడ్ హాస్పిటల్ కింద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విధానంలో తీసుకువెళ్లాలని అన్నారు ఇన్ని కార్డులు ఉన్నప్పుడు దేశంలో ఎక్కడైనా సరే మెడికల్ కాలేజీ కూడా అటాచ్ అయి ఉంటుందని సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో విజయవాడ నగరం నడిబొడ్డున ఒక సూపర్ స్పెషాలిటీ తో అన్ని డిపార్ట్మెంట్లు రావాలని కోరారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గనుక పాటిస్తే సుమారు తొమ్మిది లక్షల మంది కార్డు పెరిగే పరిస్థితి ఉందని వీటన్నిటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకువెళతారని ఆసుపత్రికి మరిన్ని హంగులు వచ్చే విధంగా కృషిచేసి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు కేంద్ర ప్రభుత్వం దృష్టికి 20వ తారీకు జరిగే పార్లమెంటు సమావేశాలు సమయంలో తీసుకువెళతానని హాస్పిటల్ ఎప్పటికప్పుడు అప్గ్రేడ్ కావలసిన అవసరం కూడా ఉందని అన్నారు ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఈ విషయాలన్నిటిపై చర్చించి వచ్చే పార్లమెంటు సమావేశాలలో శాంక్షన్ అయ్యే విధంగా కృషి చేస్తారని ఇక్కడ ఉన్న పోస్టుల కొరత వాటిని భర్తీ చేసే విధానంపై కూడా చర్చించి భర్తీ చేసేలా ప్రయత్నిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని, ఆసుపత్రి మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ వి.జ్యోతి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గాంధీ ఆర్.ఎం.ఓ డాక్టర్ జయశ్రీ, సీనియర్ డాక్టర్ రవికుమార్, మరియు ఇతర వైద్యులు,నర్సింగ్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## మండల పరిషత్ అభివృద్ధి అధికారి ( ఎంపీడీవో) కు ఘన సన్మానమీ...

జమ్మికుంట, ఇటీవల ఇల్లందకుంట మండలానికి నూతనంగా వచ్చి బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో విజయ్ కుమార్, ను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు, మంగళవారం నాడు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. దేవుని మేమంటో, ముత్యాల తలంబ్రాలు, అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ,తో మాట్లాడుతూ మండల అభివృద్ధి, గ్రామాల పురోగతి ఇల్లంధకుంట మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారం చేసే కృషిలో,గ్రామాల అభివృద్ధిలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అదించడంలో వారి పదవికాలం విజయవంతం కావాలని అన్నారు.

# కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా 'వెంకట్రామయ్య గారి తాలూకా' మూవీ ప్రీ రిలీజ్

**తెలంగాణ ఉద్యమకారిణి కోమలి సినిమాను ఆదరించాలి: కల్వకుంట్ల కవిత**

**చిన్న సినిమాలకు ప్రభుత్వం రాయితీలు కల్పించాలి: కల్వకుంట్ల కవిత**

**"ఒక ఆడబిడ్డ కన్నీటి కథే ఈ సినిమా" ?నిర్మాత కోమలి**



ప్రముఖ జానపద గాయని కోమలి నిర్మాతగా మారుతూ నిర్మించిన భావోద్వేగ కుటుంబ కథా చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా' జూలై 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. దినేష్ కుమార్ హీరోగా, ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహించారు. కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్లె, సోమేష్ సారిపల్లి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. దర్శకుడు దశరథ్, చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

"చిన్న సినిమాలకు మా పార్టీ అండగా ఉంటుంది" ? కల్వకుంట్ల కవిత

ముఖ్య అతిథి కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, ఫోక్ సింగర్ కోమలి ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించారని ప్రశంసించారు. సినిమా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, చిన్న సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించాలని సూచించారు. తెలంగాణలో చిన్న సినిమాల అభివృద్ధికి తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలుగు సినిమాల మాదిరిగానే తెలుగు ప్రజలు కూడా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

"కుటుంబ భావోద్వేగాలతో కూడిన అద్భుతమైన సినిమా" ? దర్శకుడు దశరథ్

దర్శకుడు దశరథ్ మాట్లాడుతూ, కోమలి ఎంతో అంకితభావంతో ఈ చిత్రాన్ని నిర్మించారని అన్నారు. కుటుంబ బంధాలు, భావోద్వేగాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటుందని, బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు.

×మానవ సంబంధాల విలువను గుర్తు చేసే కథ×

ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలకు ప్రేక్షకులతో పాటు సినీ వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. మానవ సంబంధాలు, తల్లిదండ్రుల విలువ, కుటుంబ బంధాలు, తండ్రి-పిల్లల అనుబంధం వంటి అంశాలను హృద్యంగా ఆవిష్కరించిన ఈ చిత్రం ప్రతి కుటుంబాన్ని ఆలోచింపజేసేలా ఉంటుందని చిత్రబృందం తెలిపింది.

ప్రస్తుతం డబ్బు చుట్టూ తిరుగుతున్న సమాజంలో వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను హృదయానికి హత్తుకునే విధంగా ఈ చిత్రంలో చూపించినట్లు పేర్కొన్నారు.

×"గ్లిజరిన్ లేకుండానే కన్నీళ్లు వచ్చాయి" ? మురళీధర్ గౌడ్×

ప్రధాన పాత్రధారి మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ, తన సినీ జీవితంలో ఎంతో కాలంగా చేయాలనుకున్న పాత్ర ఈ చిత్రంలో లభించిందన్నారు. "డీజే టిల్లు" తర్వాత తనకు అత్యంత సంతృప్తినిచ్చిన పాత్ర ఇదేనని చెప్పారు. వెంకట్రామయ్య పాత్రలో నటిస్తున్నప్పుడు గ్లిజరిన్ అవసరం లేకుండానే భావోద్వేగంతో కన్నీళ్లు వచ్చాయని తెలిపారు. ఈ సినిమా ప్రతి ఒక్కరి గుండెను తాకుతుందని, మానవ సంబంధాల విలువను గుర్తు చేస్తుందని అన్నారు.

"ఇది ఒక ఆడబిడ్డ కన్నీటి కథ" ? నిర్మాత కోమలి మహేందర్ తొట్లె

నిర్మాత కోమలి మహేందర్ తొట్లె మాట్లాడుతూ, ఇది తన నిజ జీవిత అనుభవాల ఆధారంగా రూపొందించిన చిత్రమని తెలిపారు.

"ఇది ఒక ఆడబిడ్డ కన్నీటి కథ. నా జీవితంలో ఎదురైన అనుభవాలను ఈ చిత్రంగా మలిచాను. నా భర్త సహకారం, మా గ్రామ ప్రజల ప్రోత్సాహంతో ఈ సినిమా నిర్మించగలిగాను. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ఈ చిత్రాన్ని పూర్తి చేశాం. సినిమా చూస్తున్నంతసేపు కంటతడి పెట్టకుండా ఎవరూ బయటకు రారని నమ్ముతున్నాను. నన్ను జానపద గాయనిగా ప్రోత్సహించిన మానుకోట ప్రసాద్ గారికి జీవితాంతం రుణపడి ఉంటాను. జూలై 17న ప్రతి ఒక్కరూ థియేటర్లకు వచ్చి మా సినిమాను చూసి ఆశీర్వదించాలి" అని కోరారు.

"ప్రతి కుటుంబంలో జరిగే కథ" ? సీనియర్ నటి సుధ

సీనియర్ నటి సుధ మాట్లాడుతూ, కోమలి ఒక మహిళగా ఎన్నో కష్టాలు భరిస్తూ తన సొంత సంపాదనతో సినిమా నిర్మించడం గొప్ప విషయమన్నారు. ప్రతి కుటుంబంలో జరిగే కథను ఈ సినిమాలో చూపించారని, ప్రేక్షకులు తప్పకుండా తమ జీవితాన్ని ఇందులో చూసుకుంటారని తెలిపారు. కొత్త నిర్మాతగా కోమలి చేసిన ప్రయత్నాన్ని ఆదరించాలని కోరారు.

×"పెద్దలకు గౌరవం ఇవ్వాలనే సందేశం" ? దర్శకుడు సతీష్ ఆవాల×

దర్శకుడు సతీష్ ఆవాల మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో పెద్దలకు గౌరవం ఇవ్వడం గొప్ప సంప్రదాయమని, కుటుంబాల్లో తలెత్తే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో ఈ చిత్రం చూపిస్తుందని అన్నారు. తాను జర్నలిజం నుంచి వచ్చిన వ్యక్తినని, కుటుంబ బంధాల విలువ బాగా తెలుసని చెప్పారు. సోషల్ మీడియాలో దివిజ వీడియోలు చూసి ఈ పాత్రకు ఆమె సరిపోతుందని భావించి ఈటీవీ ప్రభాకర్‌ను సంప్రదించినట్లు తెలిపారు. మురళీధర్ గౌడ్, సుధ సహా ప్రతి నటుడు ప్రాణం పెట్టి నటించడంతో సినిమా అద్భుతంగా వచ్చిందన్నారు.

×"ఆరు పాటలు ప్రేక్షకుల హృదయాలను తాకుతాయి" ? చరణ్ అర్జున్×

సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ మాట్లాడుతూ, జానపద గాయని కోమలి నిర్మాతగా సినిమా నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. ఆమె పట్టుదల గొప్పదని కొనియాడుతూ, ఈ చిత్రంలోని ఆరు పాటలు ప్రేక్షకుల హృదయాలను తాకుతాయని తెలిపారు.

×"హార్ట్ టచ్ చేసే సినిమా" ? హీరో దినేష్ కుమార్×

హీరో దినేష్ కుమార్ మాట్లాడుతూ, చిన్న గ్రామం నుంచి వచ్చిన కోమలి ఈ స్థాయి సినిమా నిర్మించడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి ప్రేక్షకుడి హృదయాన్ని తాకే కథతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలు ఇందులో ఉన్నాయని తెలిపారు.

×"అందరికీ నచ్చే కథ" ? హీరోయిన్ దివిజ ప్రభాకర్×

హీరోయిన్ దివిజ ప్రభాకర్ మాట్లాడుతూ, ఈ చిత్ర కథ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుందని అన్నారు. యూనిట్ సభ్యులంతా ఎంతో అంకితభావంతో పనిచేశారని, నిర్మాత కోమలి ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించారని తెలిపారు. జూలై 17న థియేటర్లలో సినిమా చూసి ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.

×"స్టోరీ విన్న వెంటనే ఏడ్చేశాను" ? జబర్దస్త్ సత్యశ్రీ×

నటి జబర్దస్త్ సత్యశ్రీ మాట్లాడుతూ, తన పాత్ర, కథ విన్న వెంటనే భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నానని చెప్పారు. అవకాశం ఇచ్చిన దర్శకుడు, నిర్మాతలకు ధన్యవాదాలు తెలుపుతూ, సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

×జూలై 17న ప్రేక్షకుల ముందుకు×

చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడుతూ, మంచి కథ ఎప్పటికీ ప్రేక్షకులను కదిలిస్తుందని, జూలై 17న థియేటర్లలో విడుదల కానున్న "వెంకట్రామయ్య గారి తాలూకా"ను కుటుంబ సమేతంగా చూసి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి: బీఎల్‌వోలకు పులి శివకుమార్ గౌడ్ సూచన



కూకట్‌పల్లి (ప్రజాబలం )జూలై 14 :ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణను మరింత వేగవంతం చేయాలని బాలానగర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీ గాంధీ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఎల్‌వోలు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీతో పాటు పూరించిన ఫారాల స్వీకరణలో పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఫారాలు నింపే సమయంలో ఓటర్లకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేస్తూ, ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. సేకరించిన ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు సూచించారు. అలాగే, అందుబాటులో లేని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి సంబంధిత సూపర్వైజర్లకు అందించాలని పేర్కొన్నారు. అనంతరం బాలానగర్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న ఎన్యుమరేషన్, డిజిటలైజేషన్ ప్రక్రియలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేస్తూ, ఎన్యుమరేషన్ ఫారాలను సరైన విధంగా ఎలా పూరించాలో వివరించి అవగాహన కల్పించారు.

## ఒకే రోజులో 90 లక్షలకు పైగా చిన్నారులకు రక్షణ



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 14 ( ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం తొలి రోజున తెలంగాణ రాష్ట్రం 93.29% కవరేజ్ సాధించింది. లక్ష్యంగా పెట్టుకున్న 96,81,855 మంది చిన్నారుల్లో 90,31,754 మందికి ఆల్బెండజోల్ మాత్రలను విజయవంతంగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మహిళా ౘ శిశు సంక్షేమ శాఖలు, జిల్లా యంత్రాంగం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది అందరికీ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈరోజు ఆల్బెండజోల్, మాత్ర తీసుకోలేకపోయిన చిన్నారుల తల్లిదండ్రులు జూలై 20న నిర్వహించే మాప్-అప్ రౌండ్‌లో తప్పకుండా తమ పిల్లలకు ఆల్బెండజోల్, మాత్ర వేయించి, పేగు నులిపురుగుల నుంచి ప్రతి అర్హ చిన్నారికి సంపూర్ణ రక్షణ కల్పించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## ములుగు జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించే పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించిన :: జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 14

ములుగు మంగళవారం ములుగు గట్టమ్మ వద్ద జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, జిల్లా ప్రగతిని ఒకేచోట ప్రతిబింబించేలా ఏర్పాటు చేస్తున్న పైలాన్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న కలెక్టర్, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పైలాన్‌ను ప్రారంభించే అవకాశం ఉన్న నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల అమలులో ఎలాంటి రాజీ పడకుండా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు.



అనంతరం నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయం ఆవరణలో చేపడుతున్న ల్యాండ్‌స్కేపింగ్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ మొక్కలు నాటాలని, లాన్ అభివృద్ధి, అలంకరణ మొక్కల ఏర్పాటు, నడక మార్గాల నిర్మాణం, సుందరీకరణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి ఆవరణను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, మున్సిపల్ కమిషనర్ సంపత్, గుత్తేదారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# శాంతినగర్ ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌ను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి జానకి రెడ్డి



**జహీరాబాద్, జూలై 14 ప్రజాబలం ప్రతినిధి:** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని పరిశీలించేందుకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, ప్రత్యేక అధికారి జానకి రెడ్డి జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌ను మంగళవారం సందర్శించారు.

ఈ సందర్భంగా హెల్ప్‌డెస్క్‌లో జరుగుతున్న ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణ, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీసి, హెల్ప్‌డెస్క్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుదారునికి త్వరితగతిన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం హెల్ప్‌డెస్క్‌కు వచ్చిన ప్రజలతో మాట్లాడి, వారికి ఎదురవుతున్న సమస్యలు తెలుసుకుని అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. తనిఖీలో తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో మహేందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## మరిమడ్ల గ్రామానికి గ్రామ ప్రవేశ సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి

### గ్రామ ప్రజల విజ్ఞప్తి





**కోనరావుపేట ప్రజాబలం దినపత్రిక జూలై – 14** కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోకి ప్రవేశించే మార్గంలో గ్రామ సూచిక బోర్డులు లేక ఇబ్బందులు పడుతున్నామని మంగళవారం రోజున గ్రామ ప్రజల పక్షాన కుమ్మరి వేణు బూర్ల ఉదయ్ కుమార్ లు ఒక పత్రికా ప్రకటన లో మరిమడ్ల గ్రామానికి ప్రవేశ సూచిక బోర్డులు, సరిహద్దులు లేక గ్రామ ప్రజలందరూ ఇబ్బందులకు గురవుతున్నారని తద్వారా మా గ్రామానికి వచ్చే అత్యవసర సేవలు అంబులెన్స్, అగ్నిమాపక వాహనం రావడం గానీ, ప్రభుత్వ అధికారులు గ్రామాన్ని సందర్శించే క్రమంలో కానీ, ఇతర సందర్శకులు గ్రామాన్ని సులభంగా గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారని కావున సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే గ్రామ సరిహద్దు బోర్డులు ఏర్పాటు చేసి ఊరికి ఒక గుర్తింపు ఉండేలా ప్రవేశ కామాన్ నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొనడం జరిగింది.

# ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి

### ఏటూరు నాగారం మండల పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ::ఎన్నికల నమోదు అధికారి ఆర్డీవో కృష్ణవేణి

**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూలై 14** మంగళవారం ఏటూరు నాగారం మండలంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.




ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీఓ, ఏపీఎం, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎన్యుమరేషన్ ఫారాల సేకరణతో పాటు వాటి డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు.

స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకొని ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించి, నిర్ణీత గడువులోపు డిజిటలైజేషన్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎలక్షన్ డి టీ నితీష్, డిటి రాహుల్ వర్మ, ఆర్ ఐ చిక్కుల కిరణ్ కుమార్ బి ఎల్ వో లు సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ఏటూరునాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూలై 14** ఏటూరు నాగారం మండల కేంద్రానికి చెందిన బాస తిరుపతమ్మ నిన్న రాత్రి అనారోగ్య కారణాలతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో మృతిచెందారు. ఆమె పార్థివ దేహాన్ని ఏటూరునాగారానికి తీసుకురావడంలో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం ఫోన్ ద్వారా తెలిసిన వెంటనే ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు వెంటనే స్పందించారు. అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి, ఆమె పార్థివ దేహాన్ని స్వగృహానికి చేర్చేలా సహకరించి తమ దాతృత్వాన్ని, మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు వారిని అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బాస నాగయ్య మృతిచెందిన సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ తరపున వారి కుటుంబానికి పూర్తి స్థాయిలో సహాయం అందించామని నాయకులు తెలిపారు. అలాగే, భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శివాలయం చైర్మన్ మడూగూరు ప్రసాద్, ముక్కెర లాలయ్య, ఈర్సవడ్ల కిరణ్, వల్స తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

### పాఠశాలలను కుదించాలనే ఆలోచనను విరమించుకోవాలి

### టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్.రంజాన్

**ఖమ్మం /తల్లాడ జూలై 14 ప్రజాబలం:** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తెలంగాణ రెండవ పీఆర్సీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని 2023 జూలై నుంచి అమలు కావలసిన నూతన పిఆర్సీ పై ప్రభుత్వం వెంటనే నివేదిక తెప్పించుకొని సంఘాలతో చర్చించి అమలు చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్,జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కుర్నవల్లి పినపాక తల్లాడ మిట్టపల్లి బిల్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్ యుటిఎఫ్





సభ్యత్వ క్యాంపెయిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో మూసివేసిన ప్రతి పాఠశాలలను తెరిపిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు పాఠశాలల సంఖ్యను కుదిస్తామనటం సమంజసం కాదని, వెంటనే ఆ ఆలోచనను విరమించుకోవాలన్నారు. హెల్త్ కార్డుల విధి విధానాలను రూపొందించి వెంటనే అమలు చేయాలని, 2024 మార్చి నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలన్నారు . పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని,నిత్యావసర ధరలు పెరుగుతున్నందున పెండింగ్ లో ఉన్న ఆరు డి.ఏ లను వెంటనే విడుదల చేయాలన్నారు. హెల్త్ కార్డులపై వెంటనే వైద్యం అందించాలని కోరారు. మోడల్ స్కూల్స్, కేజీబీవీ, యుఆర్ఎస్ సిఆర్టి ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని తీసుకురావాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ లాల్ సయ్యద్,టి. శ్రీనివాసరావు,టీఎస్ యుటిఎఫ్ మండల నాయకులు రఫీ, రామకృష్ణస్వామి, కిషోర్, మురళీకృష్ణ, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరులో గంజాయి అక్రమ రవాణా ముఠా అరెస్ట్

### 1.50 లక్షల విలువైన 3 కిలోల గంజాయి స్వాధీనం.

### ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు.

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 14 ప్రజాబలం:** ఖమ్మం జిల్లా కల్లూరులో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 1.50 లక్షల విలువైన మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగం తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరు పట్టణానికి చెందిన షేక్ హబీబ్, బొడ్డు చందు, మణుగూరుకు చెందిన తేజావత్ రమేష్ ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి నుంచి గంజాయిని తీసుకొచ్చి కల్లూరు పరిసర






ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.

దీంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి నిందితుల కదలికలను గమనించారు. గతంలో గంజాయి కేసులో అరెస్టై జైలు శిక్ష అనుభవించిన షేక్ హబీబ్ విడుదల అనంతరం మళ్లీ అదే నేరానికి పాల్పడినట్లు సీఐ తెలిపారు. జూలై 7న మల్కనగిరికి వెళ్లి గంజాయిని కొనుగోలు చేసిన నిందితులు, జూలై 13న పేరవంచ గ్రామానికి సరఫరా చేసేందుకు వెళ్తుండగా కల్లూరు షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో పట్టుబడ్డారు.

నిందితుల వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తులో ఎస్ఐ హరితతో పాటు పోలీసు సిబ్బంది కీలక పాత్ర పోషించారని సీఐ ముత్తులింగం అభినందించారు.

గంజాయి కొనుగోలు, రవాణా, విక్రయం, వినియోగం చట్టరీత్యా నేరమని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణాపై సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచి, తగిన పారితోషికం కూడా అందజేస్తామని తెలిపారు.

# రామగుండం సుందరీకరణకు మరో ముందడుగు..

### ఐలాండ్ నిర్మాణానికి స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

గోదావరిఖని : రామగుండం నియోజకవర్గాన్ని మరింత అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గారు ఈరోజు రామగుండంలోని ౦-పవర్ హౌస్ సర్కిల్ వద్ద ప్రతిపాదిత ఐలాండ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులను పరిశీలిస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఐలాండ్‌ను ఆధునిక నమూనాలో అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐటిడీఏ డీడీ గా బాధ్యతలు స్వీకరించిన డి. జనార్ధన్




**ఏటూరునాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి , జూలై 14** ఐటిడిఏతెలంగాణ గిరిజన సంక్షేమ శాఖలో జరిగిన తాజా పరిపాలనా మార్పుల నేపథ్యంలో ఏటూరునాగారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ లో డిప్యూటీ డైరెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్)గా డి. జనార్ధన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.



నాగర్‌కర్నూల్ జిల్లా ట్రైబల్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న పిరంగికి పదోన్నతి లభించి,

ఏటూరునాగారం ఐటిడీఏలో ఖాళీగా ఉన్న డీడీ (టిడబ్ల్యు) పోస్టుకు నియమితులయ్యారు.

ఈ నేపథ్యంలో గతంలో ఓడీ (డిప్యుటేషన్) ప్రాతిపదికన డీడీ (టిడబ్ల్యు)గా పనిచేస్తున్న మంచిర్యాల జిల్లా ట్రైబల్ డెవలప్‌మెంట్ అధికారి డి. జనార్ధన్ నియామక ఉత్తర్వులు రద్దు చేయబడ్డాయి.

అనంతరం తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్, హైదరాబాద్ జారీ చేసిన తాజా ఆదేశాల మేరకు డి. జనార్ధన్ ఏటూరునాగారం ఐటిడీఏలో డిప్యూటీ డైరెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్)గా విధుల్లో చేరుతూ, తన జాయినింగ్ రిపోర్టును ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి కు సమర్పించారు.

గిరిజన సంక్షేమ శాఖలో పరిపాలనా బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాల అమలును మరింత వేగవంతం చేయడంలో ఈ నియామకం దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు లతక్క




**ఏటూరునాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి, జూలై 14** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

ఈ మేరకు మంగళవారం ఏటూర్ నాగారం తహసీల్దార్ జగదీష్ కు వినతిపత్రం అందజేశారు.

రైతులకు సాగునీటి ఇబ్బందులు, విద్యుత్ సరఫరా లోపాలు, ఎరువులు, విత్తనాల కొరత, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం, రైతాంగంపై ఉన్న రుణభారాన్ని తగ్గించడం వంటి పలు సమస్యలను ప్రస్తావించారు. రైతులకు అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని తక్షణమే అందించి, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు.

రైతాంగ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా, మండల నాయకులు లతక్క, పద్మక్క. కొమురయ్య. రమేష్. స్వామి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ సర్వే పనులు వేగవంతం చేయండి

## జిల్లా కలెక్టర్ అంకిత్



**చంద్రుగొండ జులై 14 ప్రజబలం ప్రతినిధి :-** చంద్రుగొండ మండలంలో సీతరామ ప్రాజెక్టు పంటకాలువల కోసం భూసేకరణ సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సర్వే బృందాన్ని ఆదేశించాడు. మంగళవారం చంద్రుగొండ మండలంలో తిప్పనపల్లి రెవెన్యూ పరిధిలో సీతరామ ప్రాజెక్టు పంటకాలువల కోసం భూసేకరణ సర్వే పనులను ఆయన అకస్మికంగా తనిఖీ చేశాడు. సర్వే వివరాలను అడిగి తెలుసుకొని పనులను స్పీడ్ పెంచాలన్నారు. దామరచర్లలో సర్ ప్రోగ్రాంను తనిఖీ చేసి, అధికారులకు దిశానిర్దేశం చేశాడు. చంద్రుగొండ జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించి, క్వాలిటిని మెయింటెన్ చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వహకులకు సూచించాడు. ఆయన వెంట ఆర్టిఓ మధు, తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్, ఎంపిడిఓ అశోక్, ఆర్ఐ తిరుమలరావు, తదతరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలింపు టిప్పర్ స్వాధీనం

**జహీరాబాద్ జూలై14 ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను హద్నూర్ పోలీసులు సోమవారం ఉదయం సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. న్యాల్కల్ మండలం హుస్సెల్లి గ్రామ శివారులోని సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, టీజీ15టీ 0336 నంబర్ గల టిప్పర్‌లో సుమారు 50 టన్నుల ఫిల్టర్ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఇసుకను ఇస్మాయిల్‌ఖాన్‌పేట్--హన్మకట్ట ప్రాంతం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలింది. టిప్పర్ డ్రైవర్ మహ్మద్ ఫిరోజ్ ఖాన్, వాహన యజమాని గోవింద్‌లపై వాల్టా చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇసుక విలువ సుమారు రూ.1 లక్ష ఉంటుందని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని హద్నూర్ ఎస్సై సుజిత్ వెల్లడించారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రామగుండం పోలీస్ కమిషనర్

గోదావరిఖని సింగరేణి భరోసా యాత్రలో పాల్గొనేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాకు విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని మంగళవారం ఆర్జీ-01 పరిధిలోని ఓసీపీ-05 వద్ద రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు

# పోడు భూములను దున్నుకునేందుకు అనుమతించాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి దావూద్






**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి 14**ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలం మలకపల్లి గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజనులు గత 25 సంవత్సరాలుగా సాగు చేస్తున్న పోడు భూములను ఈ ఏడాది కూడా ట్రాక్టర్లతో దున్నుకునేందుకు అనుమతి కల్పించాలని, ఫారెస్ట్ అధికారులు అడ్డంకులు సృష్టించడం తక్షణమే నిలిపివేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం డిమాండ్ చేసింది.

ఈ మేరకు సిపిఎం ఏటూరునాగారం మండల కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో కార్యాలయంలో ఎస్‌డీసీ గంట ప్రతాప్ రెడ్డి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అశోక్ కి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి దావూద్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోరం చిరంజీవి మాట్లాడుతూ, మలకపల్లి గ్రామంలోని ఆదివాసి కుటుంబాలు దాదాపు 25 సంవత్సరాలుగా అదే భూములను ట్రాక్టర్లతో సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. గతంలో ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయని అధికారులు, ఈ ఏడాది అకస్మాత్తుగా ట్రాక్టర్లతో దున్నుకోవద్దని చెప్పడం వల్ల ఆదివాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు.

వ్యవసాయ కాలం ప్రారంభమైన ఈ సమయంలో సాగు పనులు ఆలస్యం అయితే పంటలు దెబ్బతిని ఆదివాసి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. భూములను సాగు చేయకుండా అడ్డుకోవడం వల్ల వారి జీవన హక్కు దెబ్బతింటుందని, ఇటువంటి చర్యలు తగవని అన్నారు.

అధికారులు వెంటనే మానవతా దృక్పథంతో స్పందించి, గతంలో మాదిరిగానే ట్రాక్టర్లతో పోడు భూములను దున్నుకునేందుకు అనుమతి ఇవ్వాలని, ఆదివాసులను భయభ్రాంతులకు గురిచేసే చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత సమస్యను తక్షణమే పరిష్కరించి ఆదివాసులకు న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వం ఆదివాసుల జీవన హక్కులను పరిరక్షిస్తూ, సాగు పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని, లేకపోతే సిపిఎం, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బచ్చల కృష్ణ బాబు, గుగ్గిళ్ళ దేవయ్య, టిఎల్ రవి ,తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు తోలం కృష్ణయ్య, మలకపల్లి గ్రామానికి చెందిన ఆదివాసి రైతులు, భద్రయ్య, పవన్ , చుక్కయ్య, రాజు, భీమయ్య, రమేష్, జోగమ్మ, లక్ష్మి, భీమమ్మ, లక్ష్మి, కమల, మంగలి, కమల మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి

### నిర్ణీత గడువులోపు ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

### :: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 14** కలెక్టరేట్ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలందరి సహకారంతో విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.జిల్లాలోని 2,36,970 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,46,583 ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటలైజ్ చేయబడి 61.86 శాతం పురోగతి నమోదైందని తెలిపారు. ఇంకా 82,994 ఫారాలు 38.14 శాతం డిజిటలైజేషన్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోపు వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలన్నారు.



ప్రతి ఇంటిని బీఎల్‌ఓలు తప్పనిసరిగా సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, పూర్తిగా నింపిన ఫారాలను తిరిగి సేకరించాలని సూచించారు. ఇంటికి తాళం వేసి ఉంటే మరోసారి వెళ్లి ఫారాలు సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను రోజువారీగా బీఎల్‌ఓ యాప్‌లో డిజిటలైజ్ చేసి, పెండింగ్ లేకుండా నమోదు చేయాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. డేటా నమోదు సమయంలో ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు.

బీఎల్‌ఓలు ప్రజలతో మర్యాదగా, స్నేహపూర్వకంగా మమేకమై వారి సందేహాలను నివృత్తి చేయాలని, అర్హులైన ప్రతి ఓటరికి అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు. బీఎల్‌ఏలు కూడా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా పనిచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ప్రజలు కూడా ఎన్నికల సిబ్బందికి పూర్తి సహకారం అందించి, తమ వివరాలను సరిచూసుకుని ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి, అవసరమైన పత్రాలతో నిర్ణీత గడువులోపు సంబంధిత బీఎల్‌ఓలకు అందించాలని కలెక్టర్ కోరారు. తప్పుడు సమాచారం ఇవ్వకుండా, ఓటరు జాబితా ఖచ్చితత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

ముసాయిదా ఓటరు జాబితాలో పేరు నమోదై ఉన్న ఏ ఓటరినీ ముందస్తు నోటీసు ఇవ్వ కుండా తొలగించే అవకాశం లేదని,అందువల్ల ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా, ప్రతి ఓటరు తప్పనిసరిగా తన ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి, నిర్ణీత గడువులోపు సంబంధిత బీఎల్‌ఓకు సమర్పించాలని కోరారు. ప్రతి ఓటరు స్వచ్ఛందంగా ఈ ప్రక్రియలో భాగస్వామి కావడం ద్వారా ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందించేందుకు సహకరించాలన్నారు.ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ఎన్నికల సంఘం జారీ చేస్తున్న అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోరారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం:

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తపస్ (టిపియుఎస్) ఉపాధ్యాయ సంఘం చేపట్టిన ధర్నాకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## కోహీర్‌కు సిబ్బంది.. జహీరాబాద్‌కు టీయూఎఫ్ఐడీసీ నిధులు ఇవ్వాలి

### -ఎమ్మెల్యే మాణిక్ రావు



**జహీరాబాద్, జులై 14 ప్రజాబలం ప్రతినిధి:** కోహీర్ మున్సిపాలిటీలో సిబ్బంది కొరతను వెంటనే భర్తీ చేయడంతో పాటు జహీరాబాద్ మున్సిపాలిటీలో విలీన గ్రామాల అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నిధులు విడుదల చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సీడీఎంఏ అధికారులను కోరారు. హైదరాబాద్‌లో సీడీఎంఏను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మున్సిపల్ కౌన్సిలర్ తంజిం పాల్గొన్నారు. కోహీర్ మున్సిపాలిటీలో సిబ్బంది కొరత కారణంగా పారిశుధ్యం, పరిపాలన సేవలు ప్రభావితమవుతున్నాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన పూర్తిస్థాయి సిబ్బందిని వెంటనే నియమించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అలాగే జహీరాబాద్ మున్సిపాలిటీలో గతంలో మంజూరైన టీయూఎఫ్ఐడీసీ నిధులను విడుదల చేసి, విలీన గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

వినతిపై సీడీఎంఏ సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## మహిళల ఆత్మగౌరవ సమస్యపై కలెక్టర్‌కు వినతి



**సంగారెడ్డి, జులై 14 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణంతో పాటు జిల్లాలోని ప్రభుత్వ శౌచాలయాల సమస్యలను పరిష్కరించాలని జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అస్మా మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని శౌచాలయాల వద్ద చిరు వ్యాపారుల దుకాణాలు ఏర్పడడంతో వాటి ఉనికే గుర్తించలేని పరిస్థితి నెలకొన్నదని ఫొటోల ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వివిధ గ్రామాల నుంచి ప్రతిరోజూ 20 నుంచి 30 వేల మంది జహీరాబాద్‌కు వస్తున్నప్పటికీ, మహిళలకు తగిన శౌచాలయ సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ప్రస్తుతం ఉన్న శౌచాలయాల నిర్వహణ సక్రమంగా లేదని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త శౌచాలయాలు నిర్మించి పరిశుభ్రతను మెరుగుపర్చాలని కోరారు.

వినతిపై కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందించి, జిల్లాలోని శౌచాలయాల పరిస్థితిపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## రికార్డుల నిర్వహణలో లోపాలు ఎరువుల దుకాణానికి స్టాప్‌సేల్





**జహీరాబాద్, జూలై 14 ప్రజాబలం ప్రతినిధి:** న్యాల్కల్ మండలంలోని చాల్కి ఎక్స్‌రోడ్స్‌లో ఉన్న శ్రీ ఆత్మలింగం ట్రేడర్స్ ఎరువుల దుకాణంపై వ్యవసాయ శాఖ అధికారులు స్టాప్‌సేల్ ఉత్తర్వులు జారీ చేశారు. దుకాణంలో 272 బస్తాల డీఏపీ ఎరువుల విక్రయానికి సంబంధించిన సరైన రికార్డులు, బిల్లులు నిర్వహించకపోవడం గుర్తించిన అధికారులు చర్యలు చేపట్టారు.

ఈ మేరకు దుకాణాన్ని ఏడు రోజుల పాటు మూసివేయాలని ఆదేశించారు. డీలర్ నుంచి సరైన వివరణ అందకపోతే షోకాజ్ నోటీసు జారీ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి అవినాష్ వర్మ తెలిపారు.

## సర్ ప్రక్రియ వేగవంతం చేయండి

### ఓటర్లకు అవగాహన కల్పించడం బీఎల్‌వోల బాధ్యత: అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి జూలై 14 (ప్రజాబలం):** ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే స్వీకరించి డిజిటలైజ్ చేసే ప్రక్రియనువేగవంతం చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేయడం బీఎల్‌వోల బాధ్యత అని స్పష్టం చేశారు.మంగళవారం ఉప్పల్‌లోని 375, 376 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఎన్యూమరేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ పనులను పరిశీలించి, జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఓటరికి అవసరమైన సహకారం అందించి, ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా పూరించేందుకు బీఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

కార్యక్రమంలో ఉప్పల్ తహసీల్దార్ (ఎమ్మార్వో) ఫూల్ సింగ్, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గపాడు ప్రీ ప్రైమరీ చిన్నారులకు ఎలక్ట్రిక్ ఆటో బహూకరణ

### దీపక్ కంపెనీ సహకారంతో పాఠశాలకు ప్రయాణ సౌకర్యం



**సత్తుపల్లి ప్రజాబలం ప్రతినిధి జూలై 14:** సత్తుపల్లి మండలం బుగ్గపాడు ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాల చిన్నారుల ప్రయాణ సౌకర్యం కోసం నూతన ఎలక్ట్రిక్ ఆటోను మంగళవారం పాఠశాలకు అందజేశారు. బుగ్గపాడు ఫుడ్ పార్క్‌లోని దీపక్ కంపెనీతో ప్రత్యేకంగా చర్చించి ఈ వాహనాన్ని సమకూర్చినట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ కూడా పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్నారులు సురక్షితంగా పాఠశాలకు చేరుకునేందుకు ఈ ఎలక్ట్రిక్ ఆటో ఉపయోగపడుతుందని అన్నారు.

తెలంగాణలోనే ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాల చిన్నారుల కోసం ఈ తరహా ప్రయాణ సౌకర్యాన్ని అందించడం ఒక ప్రత్యేక కార్యక్రమమని పేర్కొన్నారు.

అనంతరం ఎమ్మెల్యే అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. వారి విద్య, ఆరోగ్యం గురించి తెలుసుకుని కొంతసేపు వారితో సరదాగా గడిపారు.

ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వర్ రావు, ఎంపీడీఓ నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు గోపాల్‌రావు, రవీంద్రబాబు, కిసర రాంబాబు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవరావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మట్టా దయానంద్.



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 14:** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మంగళవారం పరిశీలించారు.మొదటగా పట్టణంలోని వైశ్య కాంతుల చెరువు కట్ట వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులు, జంగిల్ వర్క్‌ను పరిశీలించి పనుల నాణ్యత, వేగంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

అనంతరం వేంసూరు రోడ్డులో నిర్మాణంలో ఉన్న నూతన క్రిస్టియన్ భవనం పనులను సందర్శించి నిర్మాణ పురోగతిని పరిశీలించారు. పనులు నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

తదుపరి వైకుంఠ ధామంలో త్వరలో నిర్వహించనున్న కార్యక్రమాలు, పరిశుభ్రత పనులపై మున్సిపల్ కమిషనర్, ఏఈ, కాంట్రాక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కమల్ పాషాతో సమీక్ష నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని అధికారులకు దయానంద్ పలు సూచనలు, సలహాలు అందించారు.

పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ తెలిపారు.

## ధ్వంసమైన విద్యుత్ స్థంభాలు

### వెంటనే స్పందించిన మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 14:** సత్తుపల్లి పట్టణంలోని గాంధీనగర్ రోడ్ నెం.11 ప్రాంతంలో మంగళవారం ఉదయం భారీ జామాయిల్ చెట్టు ఒక్కసారిగా కూలిపోవడంతో నాలుగు విద్యుత్ స్థంభాలు విరిగిపోయాయి. దీంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

సమాచారం అందుకున్న వెంటనే మాజీ మున్సిపల్ చైర్మన్, 14వ వార్డు కౌన్సిలర్ కూసంపూడి మహేష్ ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసి, రోడ్డుపై పడిన చెట్టును తొలగించే పనులను వేగవంతం చేయించారు.



అలాగే ధ్వంసమైన నాలుగు విద్యుత్ స్థంభాల స్థానంలో కొత్త స్థంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను స్వయంగా పర్యవేక్షించారు. ప్రమాదం మరింత పెరగకుండా తక్షణ చర్యలు చేపట్టడంతో స్థానికులు కూసంపూడి మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com